ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



అనకాపల్లి

జిల్లా వార్తలు

ఆదివారం 16 జూన్ 2024

సింహాద్రి 4వ యూనిట్ షట్‌డౌన్

పరవాడ, జూన్ 15: సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ) లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 4వ యూనిట్‌ను అధికారులు శుక్రవారం అర్ధరాత్రి షట్‌డౌన్ చేశారు. వార్షిక నిర్వహణ పనుల నిమిత్తం యూనిట్‌ను తాత్కాలికంగా షెట్‌డౌన్ చేసినట్టు అధికారులు తెలిపారు. సుమారు 45 రోజుల పాటు యూనిట్‌లో నిర్వహణ పనులు చేపట్టి ఆగస్టు మొదటి వారంలో ఉత్పత్తిని పునరుద్ధరించనున్నారు. ప్రస్తుతం ప్లాంట్‌లో 1, 2, 3 యూనిట్లలో మాత్రమే ఉత్పత్తి జరుగుతున్నది.



ఈదురు గాలుల బీభత్సం

చోడవరంలో శనివారం సాయంత్రం కురుస్తున్న భారీ వర్షం

జిల్లాలో పలు చోట్ల భారీ వర్షం

- నేలకొరిగిన చెట్లు, తెగిపడిన విద్యుత్ తీగలు
- పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నైరుతి రుతుపవనాల ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం మధ్యాహ్నం జిల్లాలోని పలు మండలాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి.

గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట, బుచ్చెయ్యపేట, చోడవరం మండలాల్లో భారీ వర్షం కురిసింది. అనకాపల్లి, కశింకోట, ఎలమంచిలి, సబ్బవరం మండలాల్లో రోజంతా వాతావరణం చల్లబడి తేలికపాటి జల్లులు కురిశాయి. నర్సీపట్నంలో కొద్దిసేపు ఒక మోస్తరు వర్షం కురిసింది. మాకవరపాలెం, పరవాడ, పాయకరావుపేట మండలాల్లో వాతావరణం ... మిగతా 6వ పేజీలో



గొలుగొండ మండలం కొంగసింగిలో ఇంటిపై కూలిన భారీ వృక్షం



కోటవురట్ల మండలం జల్లూరు వంతెన సమీపంలో భారీ వృక్షం కూలిపోయిన దృశ్యం

పిడుగుపాటుకు రైతు మృతి



రాజాన పెంటయ్య (ఫైల్ ఫొటో)

రావికమతం, జూన్ 15: టి.అర్జాపురంలో శనివారం పిడుగు పడి ఓ రైతు మృతి చెందాడు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మండలంలో ఎండ తీవ్రత అధికంగా ఉంది. ఆ తరువాత నుంచి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఈదురు గాలులతో పాటు ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగు పడి టి.అర్జాపురం గ్రామానికి చెందిన రాజాన పెంటయ్య(50) మృతి చెందాడు. ఈదురు గాలులకు రావికమతం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు చోట్ల చెట్లు విరిగి పడి విద్యుత్ వైర్లు తెగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

హోం మంత్రి అనితకు అడుగడుగునా నీరాజనం

గజమాలలతో సత్కారం

- విజయోత్సవ ర్యాలీకి అశేషంగా తరలి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

పాయకరావుపేట/రూరల్, జూన్ 15: రాష్ట్ర హోంమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారిగా శనివారం సొంత నియోజకవర్గం పాయకరావుపేట చేరుకున్న వంగలపూడి అనితకు ఎన్డీఏ కూటమి శ్రేణులు అపూర్వ స్వాగతం పలికారు. సాయంత్రం 4.30 గంటలకు కాకినాడ జిల్లా తుని పట్టణం నుంచి తాండవ వంతెన మీదుగా పాయకరావుపేట చేరుకున్న మంత్రి వంగలపూడి అనితకు తాండవ వంతెనపై టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక పాండురంగస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి అనిత అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, పట్టణ టీడీపీ పార్టీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకుడు గూటూరు శ్రీనివాసరావు తదితరుల ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన భారీ విజయోత్సవ ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. పాత పంచాయతీ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి అనిత పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణంలో వై జంక్షన్ వరకు సుమారు రెండు కిలోమీటర్లు నిర్వహించిన ఈ ర్యాలీలో వివిధ సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించగా, దారిపొడవునా అభిమానులు పూలవర్షంతో ముంచెత్తారు. పలు సెంటర్లలో మంత్రి అనితకు మహిళలు హారతులు ఇవ్వగా, పలువురు నాయకులు గజమాలలతో సత్కరించారు. స్థానిక సూర్యమహల్ సెంటర్లో సత్యవరం, మాసాహెబ్‌పేట టీడీపీ నాయకులు తమలపాకుల గజమాలతో ఘనంగా సత్కరించారు. మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రజలకు మంత్రి అనిత అభివాదం చేసుకుంటూ ముందుకు కదిలారు. సాయంత్రం 6.30 గంటలకు వై జంక్షన్ నుంచి జాతీయ రహదారిపై చేరిన విజయోత్సవ ర్యాలీ జాతీయ రహదారిమీదుగా మండలంలో నామవరం వద్ద నక్కపల్లి మండలంలోకి చేరింది. కాగా మండలంలో పీఎల్.పురం, సీతారాంపురం, నామవరం గ్రామాల్లో స్థానిక టీడీపీ నాయకులు మంత్రి అనితకు పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కంకిపాటి వెంకటేశ్వరరావు, పల్లా విలియం కేరీ, బొంది కాశీవిశ్వనాధం, వంకా వెంకటరమణ, గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణరావు, గారా కృష్ణప్రసాద్, ఉరుకుట్ల వెంకటరమణ, పెదిరెడ్డి శ్రీరాములు, ఎం.రమాకుమారి, గుడబంటి శాంతమ్మ, కీర్తి సీతారాం, గణపర్తి దొరబాబు, కట్టా శ్రీను, వేములపూడి అప్పారావు తదితరులతోపాటు వివిధ గ్రామాల నుంచి వందల సంఖ్యలో తరలివచ్చిన ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



పాయకరావుపేటలో అభివాదం చేస్తున్న మంత్రి అనిత



ఉపమాక ఆలయంలో శ్రీవారి చిత్రపటాన్ని మంత్రి అనితకు బహూకరిస్తున్న దృశ్యం

'పేట' ప్రజలకు రుణపడి ఉంటా..

పాయకరావుపేట నియోజకవర్గంలో చరిత్ర సృష్టించినంతగా మెజార్టీ ఇచ్చిన ప్రజలకు తాను, తన కుటుంబం ఎంతో రుణపడి ఉంటుందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శనివారం స్థానిక పాండురంగస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం విలేకరులతో మాట్లాడారు. పాయకరావుపేట నియోజకవర్గం ఏర్పడిన తరువాత ఇంతకాలానికి మొదటిసారిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దయతో తనకు మంత్రి పదవి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సీఎం, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తనపై గురుతర బాధ్యత పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు ... మిగతా 6వ పేజీలో

నాయకులకు గుర్తింపు లేకపోవడం వల్లే ఓటమి

- ఈ ఐదేళ్లలో ప్రజా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి
- వైసీపీ ఓటమిపై రివ్యూ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ డీవీఎస్ రాజు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు

కోటవురట్ల, జూన్ 15: మండలంలోని వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులకు గుర్తింపు లేకపోవడంతో వారంతా ఎన్నికల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఓటమి పాలయ్యామని మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కోటవురట్ల మండలం తంగేడు గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ రాజు ఇంటి వద్ద పార్టీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు అధ్యక్షతన ఎన్నికల్లో ఓటమిపై రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీవీఎస్ రాజు మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో ప్రజా సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. పందూరు వంతెన కోసం 30 సార్లు అడిగితే మంజూరు కాలేదని, జల్లూరు వంతెన పూర్తయినా రెండు వైపులా అప్రోచ్ రోడ్డు పనులు చేయించుకోలేని ఘోరమైన పరిపాలన ఇచ్చారని గుర్తుంచుకోవాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ కంచుకోటను తిరిగి సాధించేందుకు కృషి చేయాలని కోరారు. వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సాగి సీతబాబు మాట్లాడుతూ నాయకులను, ప్రజాప్రతినిధులను పట్టించుకోలేనప్పుడు కష్టపడి పనిచేయాల్సిన ... మిగతా 6వ పేజీలో

క్వారీ లారీల టెర్రర్

నిబంధనలకు విరుద్ధంగా పగటి వేళల్లో యథేచ్ఛగా రాకపోకలు

- పరిమితికి మించి బండరాళ్ల రవాణా
- ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భీతిల్లుతున్న వాహనచోదకులు
- పట్టించుకోని రవాణా, పోలీసు శాఖల అధికారులు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

నిబంధనలకు విరుద్ధంగా క్వారీ లారీలు యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నాయి. పట్టపగలే పట్టణ వీధుల గుండా పరిమితికి మించి బండరాళ్లను తరలిస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రవాణా, పోలీసు శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.





అనకాపల్లి నెహ్రూచౌక్ జంక్షన్‌లో రాకపోకలు సాగిస్తున్న క్వారీ లారీలు

అనకాపల్లి మండల పరిధిలో 42కి పైగా కంకర క్వారీలు, 18 క్రషర్లు ఉన్నాయి. ఎక్కువగా మామిడిపాలెం, మార్టూరు, వూడేరు, బవులువాడ, మాకవరం, హెచ్ఎన్ అగ్రహారం, వేటజంగాలపాలెం, కుంచంగి, కూండ్రం, రొంగలివానిపాలెం పరిసరాల్లో కంకర క్వారీలు ఉన్నాయి. కుంచంగి, కూండ్రం, మామిడిపాలెం, మాకవరం పరిసరాల్లో వున్న కంకర క్వారీల నుంచి పగలు, రాత్రి అనే తేడా లేకుండా బండరాళ్లతో టిప్పర్లు, భారీ లారీలు అనకాపల్లి పట్టణ వీధుల మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. భారీ వాహనాల్లో జారిపడే విధంగా బండరాళ్లు, కంకర లోడ్ చేసుకొని పగటిపూటే పట్టణ వీధుల్లో, నిత్యం ద్విచక్రవాహనదారులు తిరుగాడే కూడళ్ల మీదుగానే క్వారీ టిప్పర్లు, లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని పాదచారులు, ద్విచక్ర వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. కొద్దిరోజుల కిందట అనకాపల్లి నెహ్రూచౌక్ కూడలి మీదుగా ఒక క్వారీ లారీ వెళుతుండగా పెద్ద బండరాయి జారి రోడ్డుపై పడడంతో ఒక ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర ... మిగతా 6వ పేజీలో

రంగురాళ్ల కోసం గుట్టుగా తవ్వకాలు

రూ.2 లక్షల విలువైన రాళ్లు లభ్యమైనట్టు జోరుగా ప్రచారం

- అటవీ సిబ్బంది కాపలా ఉన్నా అక్రమార్కులు బరి తెగించడంపై అనుమానాలు

గొలుగొండ, జూన్ 15: ఆరిలోవ అటవీ ప్రాంతంలో రంగురాళ్ల కోసం కొందరు గుర్తు తెలియని వ్యక్తులు గుట్టుగా శుక్రవారం రాత్రి తవ్వకాలు జరిపినట్టు తెలిసింది. అటవీ సిబ్బంది కాపలా ఉన్నప్పటికీ తవ్వకాలు జరగడంపై పలు అనుమానాలు వ్యక్తమవు తున్నాయి.



ఆరిలోవ అటవీ ప్రాంతంలో రంగురాళ్ల కోసం తవ్విన గొయ్యి

మండలంలోని ఆరిలోవ అటవీ ప్రాంతంలో ధన్వంతరీ వనం ప్లాంటేషన్ వద్ద రంగురాళ్ల క్వారీలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రంగురాళ్ల తవ్వకాలు జరిపినట్టు సమాచారం. సుమారు రెండు లక్షల రూపాయల విలువైన రంగురాళ్లు లభ్యమైనట్టు మండలంలో జోరుగా ప్రచారం జరుగుతోంది. రంగురాళ్లను నర్సీపట్నంలో వ్యాపారులు విక్రయించినట్టు తెలిసింది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రంగురాళ్ల తవ్వకాలపై కొందరు దృష్టి సారించారు. అయితే రాత్రి సమయంలో అటవీ సిబ్బంది ఆరిలోవ అటవీ ప్రాంతంలో కాపలా ఉన్నప్పటికీ రంగురాళ్ల తవ్వకాలు జరగడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తవ్వకాలు జరిగినట్టు చెబుతున్న ప్రాంతాన్ని శనివారం నర్సీపట్నం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సత్యనారాయణ పరిశీలించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అటవీ ప్రాంతంలో గల మట్టిపెళ్లలు విరిగిపడ్డాయని, ఎటువంటి తవ్వకాలు జరగలేదని విలేకరులకు ఆయన చెప్పారు. అటవీ ప్రాంతంలో రంగురాళ్ల తవ్వకాలు జరగకుండా నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

ముగిసిన ఎల్‌నినో

- పసిఫిక్‌లో మొదలైన తటస్థ పరిస్థితులు
- చివరి త్రైమాసికం నాటికి లానినా
- ఎల్‌నినో ప్రభావితంతో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల నమోదు
- వచ్చే ఐదు రోజులు రాష్ట్రంలో వర్షాలు

-5లో

తాడి గ్రామానికి సురక్షిత తాగునీరందించాలి

ప్రభుత్వానికి ఎన్‌జీటీ ఆదేశాలు

పరవాడ, జూన్ 15: ఫార్మా కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామానికి సురక్షితమైన తాగునీరును సరఫరా చేయాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఆదేశాలు జారీ చేసింది. గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలని, అదనపు ల్యాండ్‌ఫిల్ నిర్మాణం నిలుపుదల చేయాలని, గ్రీన్‌బెల్టు బఫర్‌జోన్ అమలు చేయడంతో పాటు ఫార్మా కాలుష్యం నుంచి కాపాడాలని కోరుతూ తాడి గ్రామస్థులు ఏప్రిల్ చివరి వారంలో ఎన్‌జీటీని ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఎన్‌జీటీలో వాదనల అనంతరం తాడి గ్రామానికి సురక్షితమైన తాగునీరు సరఫరా చేయడంతో పాటు అదనపు ల్యాండ్‌ఫిల్ నిర్మాణ పనులు నిలుపుదల చేయాలని ప్రభుత్వానికి ఎన్‌జీటీ ఆదేశాలు జారీ చేసింది. దీనికి సంబంధించిన ఆదేశాల కాపీని తాడి గ్రామస్థులు శనివారం డీఆర్‌వో దయానిధికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాదంశెట్టి నీలబాబు, మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌జీటీ జారీ చేసిన ఆదేశాల కాపీని డీఆర్‌వో దయానిధికి అందజేస్తున్న తాడి గ్రామస్థులు

బదిలీలకు రంగం సిద్ధం

- కలెక్టర్, జేసీతో సహా పలువురు ఉన్నతాధికారులను మార్చే అవకాశం
- ప్రభుత్వ శాఖల్లో ప్రక్షాళనలో భాగంగా కూటమి ప్రభుత్వం చర్యలు

అనకాపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు ప్రభుత్వ శాఖల్లోని ఉన్నతాధికారుల బదిలీలకు రంగం సిద్ధమవుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక కలెక్టర్లు, వివిధ ప్రభుత్వ శాఖల్లో ప్రక్షాళన చర్యలు చేపడుతున్న విషయం తెలిసిందే. రెండేళ్ల సర్వీసు దాటిన అధికారులను బదిలీ చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇందులో భాగంగా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టికి బదిలీ ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. అలాగే జేసీ జాహ్నవి, ఎస్పీ కేవీ మురళీకృష్ణతో పాటు పలువురు డీఎస్పీలు, సీఐలకు కూడా స్థాన చలనం జరగవచ్చని తెలిసింది. ముఖ్యంగా విద్య, వైద్య, గనులు, వ్యవసాయ శాఖల్లో భారీగా బదిలీలు ఉంటాయని సమాచారం.

విలక్షణ కెరీర్‌కు వీలుకల్పించే
లెదర్ టెక్నాలజీ

మనం పెట్టుకునే బెల్ట్, ఉప యోగించే బ్యాగ్, వేసుకునే చెప్పులు చాలావరకు తోలు ఉత్పత్తులు. జాగ్రత్తగా వినియోగించుకుంటే చాలా కాలం మన్నిక కలిగి ఉంటాయి. నిజానికి ఒక జంతువుకు సంబంధించిన తోలు లేదంటే చర్మం మూడు రోజులకే కుళ్ళిపోయి నాశనమవుతుంది, వాసన వస్తుంది. దాన్ని అలా కానివ్వకుండా రసాయనాలు/ వెజిటబుల్ మెటీరియల్‌తో సంరక్షించి, ఉత్పత్తికి అనువైనదిగా మార్చడం మొదలుకుని తుది ఉత్పత్తి వరకు యావత్తు వ్యవహారాలపై అవగాహన కలిగించేదే లెదర్ టెక్నాలజీ. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి హైదరాబాద్‌లోని 'గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ'లో మాత్రమే సంబంధిత కోర్సులు ఉన్నాయి.



పాలిటెక్నిక్ డిప్లొమాలు

తెలంగాణ - హైదరాబాద్‌లో మాత్రమే గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ ఉంది. మెహదీపట్నం నుంచి గచ్చిబౌలి వెళ్లే దారిలోని రాయదర్గ వద్ద దీన్ని 1980లో ఏర్పాటు చేశారు. ఏఐసీటీఈ ఆమోదంతో స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్‌కు అనుబంధంగా ఆరంభమైంది. ప్రస్తుతం ఈ కాలేజీ రెండు డిప్లొమా కోర్సులను ఆఫర్ చేస్తోంది.

- లెదర్ గూడ్స్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ
- లెదర్ గూడ్స్ అండ్ ఫుట్‌వేర్ టెక్నాలజీ

ఒక్కో కోర్సులో 60 సీట్లు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో మాదిరిగా మూడు యూనివర్సిటీల కోటా అమలవుతుంది. ఎస్ఎస్‌సీ(టెన్త్) ఉత్తీర్ణులు ఇందులో చేసేందుకు అర్హులు. ఈ కోర్సులో చేరేందుకు గరిష్ఠ వయోపరిమితి అంటూ ఏమీ లేదు. 'టీఎస్ పాలిసెట్'లో సాధించిన ర్యాంక్ ఆధారంగా సీటు లభిస్తుంది. ఈ రెండు కోర్సుల బోధనకు అవసరమైన సదుపాయాలన్నీ ఉన్నాయి. ఫుట్‌వేర్ ఫ్యాషన్ స్టూడియో, స్మార్ట్ తరగతి గదులు, అర్హతలకు తోడు అనుభవం ఉన్న ఫ్యాకల్టీ, డిజిటల్ లైబ్రరీ, ఈ బుక్స్, ఈ క్లాస్ రూమ్స్, కంప్యూటర్ ల్యాబ్స్, ఆధునిక ల్యాబ్స్ - మెషినరీ, బాలురకు హాస్టల్ సదుపాయం కూడా ఉంది.

- కోర్సు కాలవ్యవధి ఆరు సెమిస్టర్లు/మూడేళ్ళు. మొదటి అయిదు సెమిస్టర్లూ కాలేజీలోనే థియరీ, ప్రాక్టికల్స్ ఉంటాయి. ఈ కోర్సులో లెదర్‌కు సంబంధించి డిజైన్, ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్ కొత్తగా మెటీరియల్ టెక్నిక్‌ను బోధిస్తారు. ముడిపదార్థంగా తోలుతో మొదలు పెట్టి ఫినిషింగ్ ప్రొడక్ట్ వరకు ప్రతి అంశాన్నీ థియరీలో భాగంగా చెబుతారు. చర్మం లేదా తోలుకు రంగు, మందం అలాగే విలువ పెంచడానికి అవసరమైన అన్ని వ్యవహారాలను ఈ కోర్సులో చేరిన విద్యార్థులు చదువుకోవాలి. ఆరో సెమిస్టర్ అంటే చివరి ఆరునెలలూ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. పూర్తిగా ఇండస్ట్రియల్ ట్రైనింగ్ కోసం ఈ ఆరు నెలలు కేటాయించారు. ఈ సమయంలోనే ప్రాక్టికల్, కమ్యూనికేషన్ నైపుణ్యాలు అలవడతాయి. ఇండస్ట్రీ రెడీగా విద్యార్థులు తయారవుతారు. ఇంటర్న్‌షిప్ సమయంలో ఉచిత వసతికి తోడు విద్యార్థులకు ఉన్న నైపుణ్యాలనుబట్టి నెలకు స్టయిపెండ్‌గా లభిస్తుంది.
- దేశీయంగా బాటా వంటి కంపెనీలకు తోడు టాటా ఇంటర్నేషనల్ ఎక్స్‌పోర్ట్ డివిజన్, ఆడిడాస్, రీబాక్, నైక్, హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్(ఎక్స్‌పోర్ట్ డివిజన్), ఫరీదా ఎక్స్‌పోర్ట్స్, ఫ్లోరెన్స్ ఎక్స్‌పోర్ట్స్‌లో ఈ డిప్లొమా హోల్డర్లకు జాబ్స్ లభిస్తున్నాయి. ఫుట్‌వేర్ డిజైనింగ్, లెదర్ గూడ్స్ డిజైనింగ్, ప్రొడక్షన్ ఆఫ్ ఫుట్‌వేర్, ప్రొడక్షన్ ఆఫ్ లెదర్ గూడ్స్, ప్రొడక్షన్/టానింగ్ ఆఫ్ లెదర్, టెస్టింగ్ అండ్ క్వాలిటీ కంట్రోల్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాల్లో ఉపాధి లభిస్తుంది. మూడు నుంచి అయిదేళ్ళ అనుభవంతో ఆంత్రప్రెన్యూర్లుగానూ మారవచ్చు. సొంతంగా యూనిట్ పెట్టుకోవచ్చు. డిప్లొమాతోనే కొందరు విద్యార్థులు విదేశాల్లోని బహుళ జాతి సంస్థల్లో చేరుతున్నారు. ముఖ్యంగా చైనా, దక్షిణాఫ్రికా, బ్రెజిల్ వంటి దేశాల్లో ఉపాధి పొందుతున్నారు.
- డిమాండ్ అధికంగా ఉండటంతో కొందరు డిప్లొమా పూర్తి చేయకున్నప్పటికీ, కేవలం వ్యక్తిగత సంబంధాలతో కొద్దిపాటి జ్ఞానంతోనే జాబ్స్ పొందుతుండటం విశేషం.

ఉన్నత చదువులు: లెదర్ టెక్నాలజీలో డిప్లొమాతోనే చదువు ఆపేయనవసరం లేదు. ఈసెట్ రాసి లేటరల్ ఎంట్రీ కింద బీఈ/బీటెక్ రెండో ఏడాది కోర్సులో చేరవచ్చు. లెదర్ టెక్నాలజీ, మెకానికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, ఐటీ, సీఎస్ఈ చేయవచ్చు.

దిక్సూచి DIKSUCHI

సింగరేణిలో
మేనేజ్‌మెంట్ ట్రైయినీలు

ఖాళీలు 272

జాబ్ కార్నర్

కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్... వివిధ విభాగాల్లో కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- ఎగ్జిక్యూటివ్ క్యాడర్ పోస్టులు

1. మేనేజ్‌మెంట్ ట్రైయినీ(మైనింగ్), ఈ2 గ్రేడ్: **139**
2. మేనేజ్‌మెంట్ ట్రైయినీ(ఎఫ్ అండ్ ఎ), ఈ2 గ్రేడ్: **22**
3. మేనేజ్‌మెంట్ ట్రైయినీ(పర్సనల్), ఈ2 గ్రేడ్: **22**
4. మేనేజ్‌మెంట్ ట్రైయినీ(ఐఈ), ఈ2 గ్రేడ్: **10**
5. జూనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్, ఈ1 గ్రేడ్: **10**
6. మేనేజ్‌మెంట్ ట్రైయినీ(హైడ్రో- జియాలజిస్ట్), ఈ2 గ్రేడ్: **2**
7. మేనేజ్‌మెంట్ ట్రైయినీ(సివిల్), ఈ2 గ్రేడ్: **18**
8. జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్, ఈ1 గ్రేడ్: **3**
9. జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, ఈ3 గ్రేడ్: **30**

- నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్ పోస్టులు

10. సబ్-ఓవర్సీస్ ట్రైయినీ(సివిల్), టిఅండ్ ఎస్ గ్రేడ్-సి: 16

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/బీఎస్సీ(ఇంజనీరింగ్), సీఏ/ఐసీడబ్ల్యూఏఐ/సీఎంఏ, డిగ్రీ, పీజీ డిప్లొమా, ఎంబీఏ, ఎమ్మెస్సీ, ఎంబీబీఎస్, డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: గరిష్ఠంగా 30 ఏళ్లు మించకూడదు. జీడీఎంవో పోస్టులకు 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల వయో సడలింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రిక్రూట్‌మెంట్ టెస్ట్(ఆబ్జెక్టివ్ టైప్), సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 19

వెబ్‌సైట్: scclmines.com

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/UI6jhodలో చదవండి.

వర్కింగ్ స్టిల్‌తో ఉస్తాద్



పవన్‌కల్యాణ్, డైరెక్టర్ హరీశ్ శంకర్ కలయికలో తెరకెక్కుతున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. శ్రీలీల ఇందులో కథానాయికగా నటిస్తున్నారు. శనివారం డైరెక్టర్ హరీశ్ శంకర్ ఈ సినిమా వర్కింగ్ స్టిల్‌ను విడుదల చేశారు.

మొక్కు తీర్చుకున్న సాయితేజ్

తన మేనమామ పవన్‌కల్యాణ్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన సందర్భంగా హీరో సాయిదుర్గాతేజ్ తిరుమల వెళ్లి శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. సాయిదుర్గాతేజ్, అల్లు అర్జున్‌ను అన్‌ఫాలో చేసిన విషయం తనకు తెలియదని ఇటీవల జరిగిన ఓ మీడియా సమావేశంలో నిహారిక కొణిదెల అన్నారు



పవన్‌కు బహుమతి

పిఠాపురం ఎమ్మెల్యేగా గెలిచి.. ఇటీవలే ఉప ముఖ్యమంత్రి హోదానూ దక్కించుకున్నారు పవన్‌కల్యాణ్. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక ఆయన తన అన్నయ్య చిరంజీవి ఇంటికి వెళ్లారు. అక్కడ చిరంజీవి సతీమణి సురేఖ పవన్‌కు విలువైన మాంట్‌బ్లాంక్ పెన్నును బహుమతిగా ఇచ్చారు. "తెలుగు ప్రజల ఆకాంక్షల్ని నెరవేరుస్తావని ఆశిస్తూ.. ఆశీర్వదిస్తున్నాం" అని చిరంజీవి, సురేఖ అన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి, సురేఖ, అన్నా లెజినోవా, పవన్ కలసి ఫొటో దిగారు.

'గరం గరం'




నాని సరికొత్త పాత్రలో నటిస్తున్న చిత్రం 'సరిపోదా శనివారం'. ప్రియాంక మోహన్ హీరోయిన్. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ఆగస్టు 29న సినిమా విడుదలవుతోంది. తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేశారు. 'గరం గరం' అంటూ సాగే ఈ పాటను విశాల్ దద్లానీ ఆలపించారు. సహపతి భరద్వాజ్ లిరిక్స్ అందించగా, జేక్స్ బిజోయ్ సంగీతం అందించారు.

'భైరవ యాంథమ్'



ప్రభాస్ నటిస్తున్న 'కల్కి 2898 ఏ.డీ' నుంచి ఓ ప్రోమో సాంగ్ విడుదలైంది. 'భైరవ యాంథమ్' అని సాగే ఈ పాటను భారతదేశపు అతిపెద్ద పాటగా మేకర్స్ తెలిపారు. 21 సెకండ్స్ పాటూ సాగిన ఈ ప్రోమో సాంగ్‌ను పంజాబీ సింగర్ దిల్జీత్ దోసాంజే ఆలపించారు. పూర్తి పాటను నేడు విడుదల చేయనున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సి.అశ్వనీదత్ నిర్మిస్తున్నారు. ఈనెల 27న విడుదలవుతోంది. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. దీపికా పదుకొనే, దిశాపటాని కథానాయికలు.

ఆగస్టులో ఇస్మార్ట్



రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. ఇది 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. హీరోయిన్‌గా కావ్య థాపర్ నటిస్తున్నారు. సంజయ్‌దత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. పూరి కనెక్ట్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మి కౌర్ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: సామ్ కె నాయుడు, జియాని జియాన్నెలి, సంగీతం: మణిశర్మ.

మంత్రి కోమటిరెడ్డి చేతుల మీదుగా...



సదన్ హీరోగా పరిచయమౌతున్న చిత్రం 'ప్రణయ గోదారి'. ప్రియాంక ప్రసాద్ హీరోయిన్. పి.ఎల్.విఘ్నేశ్ దర్శకత్వం వహిస్తున్నారు, పారమళ్ళ లింగయ్య నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ "ఇటువంటి ఫీల్ గుడ్ చిత్రాలు తీస్తున్నందుకు చిత్రబృందాన్ని అభినందిస్తున్నాను. ఈ మూవీ టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్" అని చెప్పారు. ఈ చిత్రానికి డీఓపీ: ఈదర ప్రసాద్, సంగీతం: మార్కండేయ.

ఈ విజయం ఎంతో ఆనందాన్నిస్తోంది



సుధీర్‌బాబు నటించిన లేటెస్ట్ చిత్రం 'హరోంహర'. మాళవిక శర్మ ఇందులో హీరోయిన్‌గా నటించారు. జ్ఞాన సాగర్ ద్వారక దర్శకత్వం వహించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలై హిట్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు సుబ్రమణ్యం.జి, సుమంత్ నాయుడు.జి మీడియాతో ముచ్చటించారు. "ఈ సినిమా కథ వినగానే తండ్రీ కొడుకుల సెంటిమెంట్, కథానాయకుడి పాత్ర నన్ను బాగా ఆకర్షించాయి. వెంటనే సినిమాను నిర్మించడానికి ఒప్పుకున్నా. ఈ సినిమా విజయం ఎంతో ఆనందాన్నిస్తోంది. విడుదలైన అన్ని చోట్లా థియేటర్లు నిండిపోవడం చూసి ఎంతో ఆనందంగా ఉంది. మంచి సినిమా తీశామని ప్రేక్షకులు, మిత్రులు, ఇండస్ట్రీ పెద్దలు ఫోన్లు చేసి అభినందిస్తున్నారు. ప్రస్తుతం మూడు నాలుగు చిత్రాలు నిర్మిస్తున్నాం. వాటి గురించి త్వరలోనే అధికారిక ప్రకటన చేస్తాము" అని చెప్పారు.

నవ్య 'దృశ్యం' పేజీలో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/PySH7NE లో చదవండి.

ప్రేక్షకులు షాక్ అవుతారు



'నా జీవితంలో మరిచిపోలేని సినిమా 'ఏ'. 26 ఏళ్ల క్రితం ఈ సినిమా విడుదలవుతున్నప్పుడు ఎంత ఉత్సాహంగా ఉన్నానో, ఇప్పుడూ అదే ఉత్సాహంతో ఉన్నాను. ఈ నెల 21న ఈ చిత్రాన్ని తెలుగులో రీ రిలీజ్ చేస్తున్నాం. థియేటర్లలో 'ఏ' సినిమాను చూసి ఇప్పటి ప్రేక్షకులు షాక్ అవుతారు' అని కన్నడ హీరో ఉపేంద్ర అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'ఏ' చిత్రాన్ని నిర్మాత లింగం యాదవ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ శనివారం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో ఉపేంద్ర పాల్గొన్నారు.

ఇక రాజకీయాల జోలికి వెళ్లను



ఇక నుంచి తాను రాజకీయ ప్రేరేపిత కథాంశాలతో సినిమాలు చేయనని దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ చెప్పారు. గతంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల చుట్టూ అల్లుకున్న వివాదాస్పద అంశాలతో పలు సినిమాలు చేస్తూ వార్తల్లో నిలిచారు వర్మ. ఇప్పుడు ఏపీలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ఆయన తోక ముడిచినట్లు కనిపిస్తోంది. తన సినిమా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. రాజకీయాలపై సినిమాలు చేయడం మానుకుంటున్నాను. ఇక నుంచి దేవుళ్లపై సినిమాలు చేస్తాను అని చెప్పారు.

అన్ని చోట్లా ఆదరిస్తున్నారు



కన్నడ హీరో యశ్ నటించిన ఓ చిత్రం తెలుగులో 'రాజధాని రౌడీ' పేరుతో విడుదలై చక్కటి ప్రేక్షకాదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ఆదివారం సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాత సంతోష్ కుమార్ మాట్లాడుతూ 'మా 'రాజధాని రౌడీ' చిత్రాన్ని 94 కేంద్రాల్లో విడుదల చేశాం. అన్ని చోట్లా మంచి వసూళ్లు వస్తున్నాయి. ప్రేక్షకులకు ధన్యవాదాలు' అన్నారు.

ముగిసిన ఎల్‌నినో

- పసిఫిక్‌లో మొదలైన తటస్థ పరిస్థితులు
- చివరి త్రైమాసికం నాటికి లానినా
- ఎల్‌నినో ప్రభావితంతో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల నమోదు
- మరికొన్ని రోజులు వేడి వాతావరణం
- వచ్చే ఐదు రోజులు రాష్ట్రంలో వర్షాలు



విశాఖపట్నం/అమరావతి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది నుంచి ప్రపంచ వ్యాప్తంగా ప్రచండమైన వేడి వాతావరణం, వడగాడ్పులకు కారణమైన ఎల్‌నినో కథ ముగిసింది. ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో తటస్థ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాది చివరి త్రైమాసికంలో లానినా ఏర్పడనున్నది. పసిఫిక్ మహాసముద్రంలో మరికొన్ని రోజులు తటస్థ పరిస్థితులు కొనసాగుతాయని ఆస్ట్రేలియా వాతావరణ విభాగం ప్రకటించింది. గత ఏడాది ఏర్పడిన ఎల్‌నినో తీవ్రతకు మునుపెన్నడూ లేనంతగా ప్రతినెలా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అనేక దేశాల్లో తీవ్ర దుర్భిక్షం నెలకొనడంతో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో సూపర్ ఎల్‌నినోగా మారడంతో అత్యంత దుర్భర పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే మార్చి నెల తరువాత ఎల్‌నినో అనూహ్యంగా బలహీనపడడం ప్రారంభమైంది. మే నాటికి పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో బలహీనపడి తటస్థ పరిస్థితులు ఏర్పడేందుకు అనుకూలమైన వాతావరణం నెలకొంది. జూన్ నెల రెండో వారం వచ్చేసరికి ఎల్‌నినో ముగిసింది. ఈ ఏడాది వేసవిలో సాధారణం కంటే ఎక్కువగా వడగాడ్పులు వీస్తాయని వాతావరణ శాఖ ముందుగానే వెల్లడించింది. అంచనా వేసినట్టుగానే మార్చి ఒకటో తేదీ నుంచి జూన్ తొమ్మిదో తేదీ వరకు దేశంలో రికార్డు స్థాయిలో వడగాడ్పులు వీచాయని వాతావరణ శాఖ తెలిపింది. గతంలో ఎన్నడూ లేనంతగా వడగాడ్పులు/తీవ్ర వడగాడ్పులు కొనసాగడంతో దేశంలో చాలా ప్రాంతాల్లో ప్రజలు అల్లాడిపోయారు. ఒడిసాలో అత్యధికంగా 27 రోజులు, పశ్చిమ రాజస్థాన్‌లో 23 రోజులు వడగాడ్పులు/తీవ్ర వడగాడ్పులు వీచాయి. దేశంలో 36 వాతావరణ సబ్ డివిజన్‌లలో 14 సబ్ డివిజన్‌లలో 15 రోజులు, అంతకంటే ఎక్కువగా వడగాడ్పులు/తీవ్ర వడగాడ్పులు వీయడం ఇదే తొలిసారని నిపుణులు వెల్లడించారు. పశ్చిమ బెంగాల్‌లో 21 రోజులు, ఢిల్లీ, హరియాణాలో 20 రోజులు వడగాడ్పులు వీచాయి. వేసవి విడిది కేంద్రాలైన హిమాచల్‌ప్రదేశ్‌లో 12, జమ్మూకశ్మీర్‌లో 6 రోజుల పాటు వడగాడ్పులు వీచాయి. ఈ నెల 18వ తేదీ వరకు ఢిల్లీ, హరియాణా, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లలో వడగాడ్పులు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ ఏడాది చాలా ప్రాంతాల్లో రోజుల తరబడి 45 డిగ్రీలు మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాజస్థాన్, ఢిల్లీల్లో 50 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గ్లోబల్ వార్మింగ్‌కు తోడు స్థానికంగా ఏర్పడే ప్రతికూల పరిస్థితులు కూడా ఇందుకు దోహదం చేశాయని విశ్లేషకులు చెబుతున్నారు. ఎల్‌నినో ముగిసినా, దాని ప్రభావంతో దేశంలో మరికొన్ని రోజులు వేడి వాతావరణం కొనసాగుతుందని వివరించారు.

రానున్న ఐదు రోజులు వర్షాలు

ఉపరితల ద్రోణి ప్రభావంతో రానున్న ఐదు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అక్కడక్కడా పిడుగులు పడే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆదివారం అల్లూరి, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన వర్షాలు పడతాయని పేర్కొంది. శనివారం ఉదయం నుంచి కోస్తాలో తీవ్రమైన ఎండ, ఉక్కపోత కొనసాగాయి. బాపట్ల, తునిలో 40.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాధారణంగా జూన్ నెలలో 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదుకావడం అరుదుగా జరుగుతుందని వాతావరణ నిపుణులు తెలిపారు.

ఏయూలో వైఎస్ విగ్రహాన్ని తొలగించాలి

- వీసీ, రిజిస్ట్రార్‌లకు టీఎన్ఎస్ఎఫ్ వినతిపత్రం


రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రణవ్, తదితరులు

విశాఖపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని తొలగించాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్‌గోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి, రిజిస్ట్రార్ స్టీఫెన్‌లను కలిసి విగ్రహాన్ని వారం రోజుల్లోగా తొలగించాలంటూ వినతిపత్రం సమర్పించారు. విశ్వవిద్యాలయాలను రాజకీయ కేంద్రాలు చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన విద్యార్థి విభాగ రాష్ట్ర నాయకుడు ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏయూను ప్రక్షాళన చేయండి

- వర్సిటీ వనరులు, నిధులు గత ఐదేళ్లుగా వైసీపీ కోసం దుర్వినియోగం
- యూజీసీ నిధులు దుర్వినియోగం, ప్రొఫెసర్ల నియామకాల్లో అవకతవకలు
- సీఎంకు న్యాయ విద్యార్థిని సత్యాల అంజన ప్రియ ఫిర్యాదు
- విచారణకు సిట్టింగ్ జడ్జి/ప్రత్యేక బృందాన్ని నియమించాలని విజ్ఞప్తి

విశాఖపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అవినీతి పెరిగిపోయిందని, ప్రక్షాళన చేయాలని న్యాయ విద్యార్థిని సత్యాల అంజన ప్రియ శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఫిర్యాదు చేశారు. వర్సిటీలో గడిచిన ఐదేళ్లలో అవినీతి, అధికార దుర్వినియోగం పెరిగిపోయాయని, రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థులను ఉపయోగించుకున్నారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏయూ వీసీ ప్రసాదరెడ్డి బాధితురాలిగా ఈ విషయాలను తమ దృష్టికి తీసుకువస్తున్నట్టు వెల్లడించారు. గతంలో వర్సిటీలో జరుగుతున్న అవినీతిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినందుకు హాస్టల్ వార్డెన్ వేధించారన్నారు. తన ఫిర్యాదుపై ఏయూ వీసీ విచారణ చేపట్టకుండా తనను అలవాటుదారు ఆర్‌టీఐ దరఖాస్తుదారునిగా తప్పుడు ముద్ర వేశారని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై భారత ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ (ఎన్‌సీఎస్‌సీ)కు ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. వర్సిటీ వనరులు, నిధులు, వైసీపీ కోసం దుర్వినియోగం అయిన సందర్భాలు అనేకం ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ఆయన పాలనను విద్యార్థులు, ఉద్యోగులు ప్రశ్నిస్తే తప్పుడు కేసులతో అణిచివేశారని ఆమె ఆరోపించారు. యూజీసీ నిధులు దుర్వినియోగం, అవినీతి, ప్రొఫెసర్ల నియామకాల్లో అవకతవకల గురించి గవర్నర్‌కు ఫిర్యాదు చేశానని, అయినా విచారణ మాత్రం చేపట్టలేదన్నారు. వర్సిటీలో జరిగిన అక్రమాలపై తక్షణమే సిట్టింగ్ జడ్జి/ప్రత్యేక బృందాన్ని నియమించి విచారణ జరిపించాలని ఆమె తన లేఖలో సీఎం చంద్రబాబునాయుడును కోరారు. వందేళ్ల ఉత్సవాలకు సిద్ధమవుతున్న తరుణంలో ఏయూలో అవినీతిని నిర్మూలించి, అవినీతిపరులను తొలగించి ప్రక్షాళన చేయాలని ఆమె కోరారు. రాజకీయాలు లేని పరిపూర్ణమైన అధ్యయన వాతావరణంతో కూడిన విద్యా సంస్థను విద్యార్థులకు బహుమతిగా సీఎం అందిస్తారని తాను ఆశిస్తున్నానన్నారు.

పలాస, గుణుపూర్, బ్రహ్మపూర్ రైళ్లు తాత్కాలిక రద్దు

విశాఖపట్నం, జూన్ 15: వాల్తేరు డివిజన్ పరిధిలో బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 17, 18వ తేదీల్లో పలు రైళ్లను రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. ఈనెల 17న విశాఖ-పలాస (07 470), పలాస-విశాఖ (07401), విశాఖ-గుణుపూర్ (08522), గుణుపూర్-విశాఖ (08521), విశాఖ-బ్రహ్మపూర్ (18526), ఈనెల 18న బ్రహ్మపూర్-విశాఖ (18525) రైళ్లను రద్దు చేసినట్టు పేర్కొన్నారు. కాగా, ఈనెల 16న సికింద్రాబాద్- సంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్ (07234) సికింద్రాబాద్‌లో నిర్ణీత సమయంకన్నా నాలుగు గంటలు ఆలస్యంగా, అలాగే 17న సికింద్రాబాద్-షాలిమార్ ఎక్స్‌ప్రెస్ (07225) సికింద్రాబాద్‌లో నిర్ణీత సమయం కన్నా రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేసినట్టు ఆయన వివరించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	128.00
లైవ్ ధర	148.00
విత్ స్కిన్	266.00
స్కిన్ లెస్	276.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

తుమ్మపాల సంత .. ట్రాఫిక్ చింత

- రోడ్లపైనే వ్యాపారాలు
- రాకపోకలకు వాహనదారుల అవస్థలు
- కానరాని ట్రాఫిక్ పోలీసులు


తుమ్మపాలమెయిన్‌రోడ్డులో ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు, (ఇన్‌సెట్‌లో) దిబ్బపాలెం రోడ్డులో నిలిపి వేసిన వాహనాలు

తుమ్మపాల, జూన్ 15 : మండలంలోని తుమ్మపాలలో ప్రతి శనివారం జరిగే వారపుసంతతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది. మెయిన్‌రోడ్డుపై వ్యాపార లావాదేవీలు సాగుతుండడంతో ప్రయాణికులకు చుక్కలు కనబడుతున్నాయి. ఆయా గ్రామాల నుంచి అనకాపల్లి పట్టణానికి చేరుకునే వారు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుంటు న్నారు. నియంత్రించాల్సిన ట్రాఫిక్ పోలీసులు అడ్రస్ లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు.

తుమ్మపాల ప్రధాన జంక్షన్‌లో జరిగే వారపుసంత కారణంగా ప్రతీ వారం ట్రాఫిక్ సమస్య విపరీతంగా పెరిగిపోతోంది. ఈ జంక్షన్ నుంచి రాకపోకలు సాగించే పలు గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా దిబ్బపాలెం-వెంకుపాలెం రోడ్డుకు ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలకు పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి. మెయిన్‌రోడ్డుపైనే పశువుల అమ్మకాలు, కొనుగోళ్లు సాగుతుండడం, నాటుకోళ్ల వ్యాపారం, కూరగాయలు, వ్యవసాయ పనిముట్లు అమ్మకాలు జరుగుతుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఉదయం స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారస్థులు తుమ్మపాల వద్ద ట్రాఫిక్‌లో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తుమ్మపాల సంత దాటాలంటే 30 నిమిషాలకు పైగా పడుతుండడంతో నానా అవస్థలు పడుతున్నారు. దీనికితోడు మెయిన్‌రోడ్డుపైనే ద్విచక్ర వాహనాలు, పశువుల తరలింపు వాహనాలు, వ్యాన్‌లను చిందరవందరగా నిలిపివేస్తుండడంతో అడుగు తీసి అడుగు వేసే పరిస్థితి లేకుండా పోతోంది. దిబ్బపాలెం రోడ్డును ఆనుకుని ఉన్న ఊడేరు, బవులవాడ, దిబ్బపాలెం గ్రామాల నుంచి రాకపోకలు సాగించే వారు ట్రాఫిక్‌లో చిక్కుకుని అవస్థలు పడుతున్నారు. అలాగే వెంకుపాలెం రోడ్డులోని తగరంపూడి, సీతానగరం, మెట్టపాలెం, వెంకుపాలెం గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. పలు సందర్భాల్లో భారీ వాహనాలతో పాటు 108 వాహనం, అంబులెన్స్‌ల సైతం ట్రాఫిక్‌లో చిక్కుకున్న దాఖలాలు ఉన్నాయి. పలు సందర్భాల్లో స్థానిక యువకులు చొరవ చూపి ట్రాఫిక్‌ను నియంత్రించే ప్రయత్నం చేస్తున్నప్పటికీ తిరిగి కథ మొదటికొస్తున్నది. ప్రతీ శనివారం ఉదయం, సాయంత్రం వేళల్లో తుమ్మపాలలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉండడంతో ఈ రోడ్డులో ప్రయాణించేవారు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళుతున్నారు. అయినప్పటికీ ట్రాఫిక్ పోలీసులు తుమ్మపాల సంతపై కనీసం దృష్టి సారించకపోవడంపై పలువురు విమర్శిస్తున్నారు. ప్రతీ శనివారం తుమ్మపాలలో ట్రాఫిక్ నియంత్రణ కోసం పనిచేయాలని పలువురు కోరుతున్నారు.

అస్తవ్యస్తంగా తుమ్మపాల సంత



తుమ్మపాలలో ప్రతీ శనివారం జరిగే వారపు సంత అస్తవ్యస్తంగా సాగుతోంది. తుమ్మపాల మెయిన్ రోడ్డుపైనే వ్యాపారాలు సాగిస్తూ వాహనదారులకు కొనుగోలు, అమ్మకందారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఎడ పెడ వాహనాలను నిలిపివేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. చాలా సందర్భాల్లో అంబులెన్స్‌ల సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి.

- సందిన సునీల్, తుమ్మపాల

ఎన్నికల హామీలను నెరవేరుస్తాం

అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్


సమావేశంలో మాట్లాడుతున్న అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్

పరవాడ, జూన్ 15: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ పూర్తిస్థాయిలో నెరవేరుస్తామని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ స్పష్టం చేశారు. కూటమి విజయానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. శనివారం స్థానిక కూటమి కార్యాలయం వద్ద కార్యకర్తలతో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు అద్వితీయమైనదన్నారు. యువతకు ఉపాధి కల్పించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. వైసీపీ నాయకులు టీడీపీ, జనసేన, బీజేపీలోకి రావాలని ప్రయత్నిస్తే.. వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ రానీయవద్దన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఏసమస్యపైన అయినా తనకు ఫోన్ చేస్తే పరిష్కారమార్గాన్ని చూపుతానన్నారు. కాలుష్యం బారిన పడిన గ్రామాలను తరలించేందుకు చిత్తశుద్ధితో కృషిచేస్తానన్నారు. తనకు అఖండ విజయాన్ని చేకూర్చిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పెందుర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ మాట్లాడుతూ తన దృష్టికి తీసుకురాకుండా నియోజకవర్గంలో టీడీపీ సమావేశాలు నిర్వహించకూడదన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీలను కూటమి నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ మాధవ్, మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాదంశెట్టి నీలబాబు, మాసవరపు అప్పలనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి బుగిడి రామగోవిందరావు, సర్పంచులు సిరపురపు అప్పలనాయుడు, బొద్దపు శ్రీనివాసకాసులు, మోటూరు సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పాఠ్యపుస్తకాల పంపిణీ

- రాష్ట్ర పరిశీలకుడు ఇస్మాయిల్


పాఠ్యపుస్తకాల స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఇస్మాయిల్

రోలుగుంట, జూన్ 15: స్టాక్ పాయింట్‌కు వచ్చిన పాఠ్య పుస్తకాలను ఆయా పాఠశాలలకు సకాలంలో పంపిణీ చేసి విద్యార్థులకు అందించేందుకు సత్వర చర్యలు చేపట్టాలని రాష్ట్ర పరిశీలకుడు ఇస్మాయిల్ విద్యాశాఖ సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండలంలోని రోలుగుంట జడ్పీ పాఠశాలలో ఉన్న స్టాక్ పాయింట్, జె.నాయుడుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. రోలుగుంట స్టాక్ పాయింట్‌కు వచ్చిన విద్యార్థుల కిట్ రికార్డులు, స్టాక్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కిట్స్ నాణ్యత, రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్ నమోదు తదితర అంశాలపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. జె.నాయుడుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాల పంపిణీని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు జాన్‌ప్రసాద్, జగ్గారావు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

ఐదు లక్షల హెక్టార్లలో పామాయిల్ సాగు లక్ష్యం

- పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ మల్లేశం పూల


పామాయిల్ పంటలను పరిశీలిస్తున్న దృశ్యం

దేవరాపల్లి, జూన్ 15: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఐదేళ్లల్లో దేశంలో ఐదు లక్షల హెక్టార్లలో పామాయిల్ పంటను సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ మల్లేశం పూల తెలిపారు. మలేషియా, ఇండోనేషియాకి సమాంతరంగా ప్రస్తుతం మన దేశంలోని 12 రాష్ట్రాల్లో తమ సంస్థ సహకారంతో సుమారు 50 వేల మంది రైతులు 80 వేల హెక్టార్లలో పామాయిల్ పంటను సాగు చేస్తున్నారన్నారు. దేవరాపల్లిలో కిలపర్తి భాస్కరరావు తదితర రైతులు సాగు చేస్తున్న పామాయిల్ తోటలను ఆయన తన బృందంతో కలిసి పరిశీలించారు. మొక్క చనిపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు పంట దిగుబడిని పెంచుకోవడానికి అవసరమైన మెలుకువల్ని ఆయన రైతులకు సూచించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో 80 శాతం, తెలంగాణలో 15 శాతం, మిగతా రాష్ట్రాల్లో కేవలం ఐదు శాతం పామాయిల్ పంటను సాగు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం పెద్దాపురం, కృష్ణాపురంలో నూనె శుద్ధి కర్మాగారాలు ఉన్నాయన్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లో జూలైలో మరో కర్మాగారం ప్రారంభమవుతుందని చెప్పారు. తెలంగాణ, కర్ణాటక, మిజోరాం, అసోం రాష్ట్రాల్లో మరికొన్ని కర్మాగారాలు నెలకొల్పుతామన్నారు. నేషనల్ మిషన్ ఎడిబిల్ ఆయిల్స్ పథకం ద్వారా స్వయం సమృద్ధి (వంట నూనెల అభివృద్ధి) సాధనలో భాగంగా పామాయిల్ పంటకు ప్రోత్సాహం అందుతుందన్నారు. తద్వారా వంట నూనె గురించి ఇతర దేశాలపై ఆధారపడకుండా ప్రతీ హెక్టారుకు 4 టన్నుల నుంచి 20 టన్నుల వరకు పామాయిల్ దిగుబడి వస్తుందన్నారు. మిగతా నూనె గింజల్ని సాగు చేస్తే కేవలం 500 కేజీలకు మించి దిగుబడి రాదన్నారు. దళారులు లేని ఏకైక పంటగా ఆయిల్‌ఫామ్ గుర్తింపు పొందిందన్నారు. వ్యవసాయం రంగంలో ఈ పంటను సాగు చేసే రైతుకి 75.25 శాతం పంట చేతికందే ఏకైక పంట ఇదేనన్నారు. తమ కొనుగోలు కేంద్రానికి పామాయిల్ గెలలు విక్రయించిన 14 రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లోకి ప్రభుత్వం నిర్ణయించిన ధర ఆధారంగా నగదును జమ చేస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం టన్ను ఆయిల్‌పాం ధర రూ.13,284లు ఉందన్నారు. రైతుల అభ్యర్థన మేరకు పామాయిల్ గెలలు కొనుగోలు కేంద్రాలను అదనంగా పెట్టడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పామాయిల్ సాగు చేస్తున్న విధానంలో కిలపర్తి భాస్కరరావు అనుసరిస్తున్న విధానాన్ని అభినందించారు. ఆయన వెంట సంస్థ జనరల్ మేనేజర్ టీవీ రమణ, పట్టాభి రామిరెడ్డి, చంద్రశేఖర్, రమేశ్, సురేశ్ తదితరులు ఉన్నారు.

వెంకటగిరి ఐఐహెచ్‌టీలో స్పాట్ అడ్మిషన్లు

అనకాపల్లి రూరల్, జూన్ 15: వెంకటగిరిలోని ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)లో డిప్లమో కోర్సులలో ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు స్పాట్ అడ్మిషన్లను నిర్వహిస్తున్నట్టు జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి ఆర్‌వీ మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో రెండు, మూడు సంవత్సరాల లేటరల్ ఎంట్రీ (డీహెచ్‌టీడీ)కు ఈనెల 20వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థులు అర్హులన్నారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, ఐటీఐలో పాసైన విద్యార్థులకు నేరుగా రెండో సంవత్సరంలోకి ప్రవేశం కల్పిస్తారన్నారు. వయసు 15-23 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు గరిష్ఠ వయో పరిమితి 25 సంవత్సరాలన్నారు. మొదటి సంవత్సరంలో రూ. 1,100, రెండో సంవత్సరంలో రూ. 1,200 స్టైఫండ్ ఇస్తారన్నారు. ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ రాష్ట్రాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చునన్నారు. వివరాలకు 8008705688, 9703424768 నంబర్ల ద్వారా సంప్రదించాలన్నారు.

కొండచిలువ హతం


హతమైన కొండచిలువ

రావికమతం, జూన్ 15: కూలీలను హడలెత్తించిన భారీ కొండచిలువ ఎట్టకేలకు హతమైంది. ఈ సంఘటన శనివారం కొమిరలో చోటుచేసుకుంది. మండలంలోని కొమిర గ్రామ శివారులో ఓ రైతుకు చెందిన సరుగుడు తోటను నరికేందుకు శనివారం ఉదయం కూలీలు వెళ్లారు. కూలీలు సరుగుడు కర్రలను కోస్తున్నారు. అప్పటికే తోటలో తుప్పల్లో ఉన్న భారీ కొండచిలువ వారిపైకి ఎగసిపడింది. దీంతో భయభ్రాంతులకు గురైన కూలీలు పరుగులు తీశారు. కొంత సేపటికి కూలీలు దానిని హతమార్చారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ ఫట్టాన్ షియాజ్ ఖాన్

నర్సీపట్నం, జూన్ 15: దేశవ్యాప్తంగా ఈ నెల 29న నేషనల్ లోక్ అదాలత్‌ని విజయవంతం చేయాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఫట్టాన్ షియాజ్ ఖాన్ అన్నారు. శనివారం స్థానిక కోర్టు సముదాయంలో పోలీసులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ పడే అవకాశం ఉన్న సివిల్, క్రిమినల్ కేసులలో కక్షిదారులకు లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలన్నారు. దీనివల్ల వారికి సమయం, డబ్బు వృథా కాదన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు సివిల్ జడ్జి మధుసూదనరావు, సీనియర్ న్యాయవాది పొక్కునూరి నాగేశ్వరరావు, అనిమిరెడ్డి గోవిందరావు, వాసవి దత్త, మృదుల తదితరులు పాల్గొన్నారు.

వూషూ టోర్నమెంట్‌లో ప్రియాంకకు సిల్వర్ మెడల్


వూషూ క్రీడాకారిణి ప్రియాంక

నర్సీపట్నం, జూన్ 15 : జాతీయ స్థాయి వూషూ టోర్నమెంట్‌లో నర్సీపట్నం ప్రాంతానికి చెందిన ప్రియాంక ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం కైవసం చేసుకుంది. ఈ నెల 10 నుంచి 14 తేదీ వరకు కర్ణాటక రాష్ట్రం విద్యగిరి, బాగల్కోట్‌లో నిర్వహించిన అఖిల భారత ఉమెన్ నేషనల్ (సౌత్ జోన్) వూషూ టోర్నమెంట్‌లో ప్రియాంక పాల్గొని ఈ ఘనత సాధించింది. ఈ సందర్భంగా ప్రియాంకను ఏపీ వూషూ అసోసియేషన్ సెక్రెరీ ముత్యాలరావు, శాప్ కోచ్ అబ్బు అభినందించారు.

ఎన్టీఆర్ వైద్యాలయంలో పాము కలకలం


పామును పట్టుకున్న సెక్యూరిటీ సిబ్బంది

అనకాపల్లి టౌన్, జూన్ 15: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో శనివారం ఉదయం పాము కలకలం రేపింది. ఉదయం పది గంటల సమయంలో వైద్యాలయంలోని స్కానింగ్ గదిని సిబ్బంది తీసిన వెంటనే పాము కనిపించడంతో సిబ్బందితో పాటు స్కానింగ్‌కు వచ్చిన రోగులు భయాందోళనకు గురయ్యారు. సెక్యూరిటీ సిబ్బంది స్పందించి వెంటనే స్కానింగ్ గదిలో ఉన్న పెసర పామును చంపి సమీపంలోని కాలువలోకి పడేశారు. పాము కలకలం రేపడంతో అతి సమీపంలో ఓపీ క్యూ లైన్‌లో ఉన్న రోగులు కూడా ఆందోళన చెందారు. ఈ విషయమై ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌ను సంప్రదించగా.. వైద్యాలయం ఆవరణలోని పాత అన్న క్యాంటీన్ భవన పరిసరాలు పరిశుభ్రం చేస్తుండగా పెసర పాము బయటకు వచ్చిందని, వెంటనే సిబ్బంది దానిని చంపి దూరంగా పడేశారని వివరించారు.

భద్రతలో రాజీపడొద్దు

- ఎన్టీపీసీ డైరెక్టర్ (ఆపరేషన్స్) రవీంద్రకుమార్


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎన్టీపీసీ డైరెక్టర్ (ఆపరేషన్స్) రవీంద్రకుమార్

పరవాడ, జూన్ 15: పరిశ్రమల్లో భద్రత కల్పించడంలో ఎలాంటి రాజీ పడొద్దని, భద్రతే చాలా ముఖ్యమని ఎన్టీపీసీ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎస్‌హెచ్ రవీంద్రకుమార్ అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీలో దక్షిణ ప్రాంత ప్రాజెక్టుల పనితీరుపై శనివారం ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యత కల్పించడంపై దృష్టి సారించాలన్నారు. ప్రమాదాలు జరగకుండా, నష్టాలు వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సౌత్ ఆర్‌ఈడీ ప్రేమ్ ప్రకాశ్, ఓఎస్ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అరిందమ్ సిన్హా, సీసీ విభాగం ఈడీ విజయ్‌ప్రకాశ్, రామగుండం ఈడీ కేఆర్ పాండు, సింహాద్రి సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా, కుడ్గి సీజీఎం బీఎస్‌ఝూ ఏకె మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపమాక వెంకన్న సన్నిధిలో మంత్రి అనిత

▸ పదవి చేపట్టి తొలిసారిగా నియోజకవర్గానికి రాక ▸ బ్రహ్మరథం పట్టిన ప్రజలు ▸ పూర్ణకుంభంతో స్వాగతం పలికిన అర్చకులు


'పేట'లోని గౌతమ్ సెంటర్‌లో మంత్రికి గజమాలతో సత్కారం


ఉపమాక వెంకన్న ఆలయంలో కుమార్తె, కుమారుడితో కలిసి పూజలు

నక్కపల్లి, జూన్ 15 : హోం మంత్రి పదవి పొంది తొలిసారిగా శనివారం నియోజకవర్గానికి విచ్చేసిన వంగలపూడి అనితకు ప్రజానీకం సాదర స్వాగతం పలికారు. అడుగడుగునా టీడీపీ శ్రేణులు నీరాజనం పలికారు. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవం మండలాల్లో ర్యాలీగా వచ్చిన ఆమె ఉపమాక వెంకన్న ఆలయానికి రాత్రి 10.30 గంటలకు చేరుకున్నారు. కుమారుడు, కుమార్తెతో కలిసి విచ్చేసిన ఆమెకు జడ్పీ కో-ఆప్షన్ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి కొండబాబు, ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి నేతృత్వంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు అఖండ స్వాగతం పలికారు. అనంతరం ఉపమాక ఆలయంలో అర్చకుల బృందం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం స్వామివారి చిత్రపటాన్ని, శేషవస్త్రాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి శివదత్, టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, కొండబాబు, కురందాసు నూకరాజు, బుజ్జి, వెంకట్రాజు, అబద్ధం, జగదీశ్వరరావు, జనసేన నాయకుడు తోట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


అడ్డరోడ్డు జంక్షన్‌లో టీడీపీ శ్రేణులు, అభిమానులకు అభివాదం

ఎస్.రాయవరం మండలంలో ఘన స్వాగతం

ఎస్.రాయవరం : హోం మంత్రి పదవి చేపట్టాక మండలానికి వచ్చిన వంగలపూడి అనితకు మండల ప్రజానీకం సాదర స్వాగతం పలికారు. పాయకరావుపేట నుంచి ర్యాలీగా వచ్చిన ఆమెకు అడ్డరోడ్డు జంక్షన్‌లో రాత్రి మాజీ ఎంపీపీ యేజేర్ల వినోద్‌రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, మాజీ అధ్యక్షుడు ఎస్.వెంకటరాజు తదితరులు ఘనంగా స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు బొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆ తరువాత ధర్మవరం అగ్రహారం వరకు ర్యాలీగా వెళ్లిన ఆమెకు గెడ్డపాలెం, గోకులపాడు, పెనుగొల్లు, ధర్మవరం అగ్రహారం జంక్షన్ల వద్ద నాయకులు, కార్యకర్తలు బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతులిచ్చారు. అందరికీ అభివాదం చేసుకుంటూ మంత్రి అనిత ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు అల్లు నరసింహమూర్తి, గుర్రం రామకృష్ణ, వజ్రపు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

కన్నబాబురాజు అక్రమాలపై సిట్‌తో విచారణ

▸ కూటమి నాయకుల డిమాండ్

▸ భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణ


సమావేశంలో పాల్గొన్న కూటమి నాయకులు

అచ్యుతాపురం, జూన్ 15 : ఎలమంచిలి మాజీ ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తి రాజు (కన్న బాబు) అక్రమాలపై సిట్‌వేసి విచారణ జరిపించాలని కూటమి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం అచ్యుతాపురంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఘోర పరాజయానికి గురైన కన్నబాబు రాజు తాను రాజకీయ సన్యాసం చేస్తున్నానని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా ఆయన ప్రజలకు చేసిందేమీ లేదని, కేవలం ధనార్జనకే అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. నిరుపేద రైతుల భూములకు ఏపీఐఐసీ అధికారులతో నోటీసులు ఇప్పించి వారిని భయభ్రాంతు లకు గురిచేసి తక్కువ ధరలకు కొనుగోలుచేసి, రియల్‌ఎస్టేట్ వ్యాపారంతో కోట్లు సంపాదించారని ఆరోపించారు. అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో కొండలను బోడి కొండ లుగా మార్చి భారీ స్థాయిలో గ్రావెల్ వ్యాపారం చేశారన్నారు. అలాగే సెజ్‌లో గల కర్మాగారాల యాజమాన్యాలను బెదిరించి భారీ స్థాయిలో దోచుకున్నారని ఆరోపించారు. కన్నబాబు రాజు అవినీతిపై సిట్ వేసి విచారణ జరపాలని ప్రస్తుత ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌ను కోరినట్టు చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు దొప్పెర్ల సర్పంచ్ కొరుప్రోలు చిన్నారావు, అచ్యుతాపురం, చిప్పాడ ఎంపీటీసీలు ద్వారపురెడ్డి బాపూజీ, రాజాన పైడి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం

... 3వ పేజీ తరువాయి

చల్లబడింది. దేవరాపల్లిలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. నాలుగు రోడ్ల కూడలిలో హనుమాన్ గుడి వద్ద విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మాడుగులలో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులకు మోదకొండమ్మ అమ్మవారి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ, డిజిటల్ బోర్డులు నేలకొరిగాయి. కోటవురట్ల మండలంలో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. కోటవురట్ల నుంచి నర్సీపట్నం వెళ్లే మార్గంలో జల్లూరు వంతెన సమీపంలో భారీవృక్షం కూలిపోయింది. దీంతో రెండున్నర గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. మరో రెండు రోజుల పాటు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ కేంద్రం అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్న తరుణంలో జిల్లాలో కురుస్తున్న వర్షాలు రైతులకు ఊరటనిచ్చాయి.

చోడవరంలో..

చోడవరం: మండలంలో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు వర్షం కురిసింది. భారీ వర్షం కారణంగా పట్టణంలోని రెల్లికాలనీ, కో ఆపరేటివ్ కాలనీ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగి పొర్లాయి. పూర్ణా థియేటర్ ప్రాంతంలో రోడ్డుపై వర్షపు నీరు ప్రవహించింది. వర్షంతో పాటు గాలులు కూడా వీయడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

అనితకు అడుగడుగునా నీరాజనం

... 3వ పేజీ తరువాయి

మండలాల టీడీపీ అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, కొప్పిశెట్టి వెంకటేశ్, అమలకంటి అబద్ధం, జానకి శ్రీనుతో పాటు పట్టణ పార్టీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, యాళ్ల వరహాలు, ఎం.రమాకుమారి తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

నక్కపల్లి: మండలంలో రాష్ట్ర హోంమంత్రి అనితకు ఘన స్వాగతం లభించింది. దేవవరంలో మాజీ ఎంపీపీ దేవర సత్యనారాయణ, సూర్య గణేశ్, గొడిచెర్ల జంక్షన్ వద్ద మెరక గ్రామాల టీడీపీ నాయకులు వైబోయిన రమణ, దొరబాబు, నానేపల్లి రాఘవులు, మారిశెట్టి నానాజీ, ఉద్దండపురం వద్ద మాజీ సర్పంచ్ రమణ, జనసేన, టీడీపీ నాయకులు గజమాలలతో సత్కరించారు. వేంపాడు వద్ద ఉప సర్పంచ్ అయినంపూడి అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యుడు కుంచెమధు, పల్లా రాంబాబు, న్యాయంపూడి వద్ద జనసేన నేత ఆకేటి గోవిందరావు, టీడీపీ నాయకులు వెదుళ్ల శ్రీను, వెదుళ్ల పాపారావు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. మండల కేంద్రమైన నక్కపల్లిలో శనివారం రాత్రి 8.30 గంటలకు హోం మంత్రి అనిత కాన్వాయ్ చేరుకోగానే టీడీపీ , జనసేన, బీజేపీ శ్రేణులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, పెంకులరాజు, మీగడ సత్తిబాబు, కేవీ సత్యనారాయణ, లోవరాజు, కక్కిరాల సురేశ్, సన్యాసిరావు, జనసేన నాయకులు కురందాసు అప్పలరాజు, బీజేపీ నాయకులు కోసూరి శ్రీను, పోలినాటి నానాజీ తదితరులు పాల్గొన్నారు. అనిత తన వాహనం పైనుంచి కార్యకర్తలకు అభివాదం చేస్తూ, పలువురితో కరచాలనం చేశారు.

క్వారీ లారీల టెర్రర్

... 3వ పేజీ తరువాయి

గాయాలయ్యాయి. సదరు క్వారీ యాజమాని ఆస్పత్రిలో చేర్పించి ఎటువంటి కేసు లేకుండా చికిత్స చేయించి పంపేశారు. అనకాపల్లి పరిసరాల్లో వున్న క్వారీల నుంచి నిత్యం పదుల సంఖ్యలో క్వారీ లారీలు పట్టణ వీధుల మీదుగా రేయింబవళ్లు తేడా లేకుండా రాకపోకలు సాగిస్తుండడంతో ఎప్పుడు ఏ వాహనం నుంచి బండరాళ్లు జారిపడతాయోనని వాహనచోదకులు భీతిల్లుతున్నారు.

పట్టించుకోని అధికారులు

క్వారీల నుంచి నిబంధనలు పాటించకుండా పగటి పూట కూడా అధిక లోడ్‌తో లారీలు, టిప్పర్లు పట్టణ వీధుల్లో రాకపోకలు సాగిస్తున్నా పోలీసు, రవాణాశాఖాధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. వాస్తవానికి రాత్రి వేళల్లో మాత్రమే పరిమితికి మించకుండా బండరాళ్లు, కంకర రవాణా చేయాల్సి ఉంది. అయితే ఈ నిబంధనలను లారీ యజమానులు పాటించడం లేదు. అప్పుడప్పుడు రవాణాశాఖాధికారులు అధిక లోడ్‌లతో వెళుతున్న కొన్ని లారీలు, టిప్పర్ల యజమానులపై కేసులు నమోదుచేసి అపరాధ రుసుము విధించి వదిలేస్తుండడంతో కొద్ది రోజుల్లోనే మళ్లీ అవే వాహనాలు యథేచ్ఛగా రోడ్లపై అధిక లోడ్‌లతో తిరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పోలీసు, రవాణాశాఖాధికారులు అధిక లోడ్‌లతో క్వారీల నుంచి పట్టణ వీధుల మీదుగా తిరుగుతున్న లారీలు, టిప్పర్లను నియంత్రించాలని, ప్రమాదాలు జరగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఎంపీ సీఎం రమేష్‌కు శుభాకాంక్షల వెల్లువ


సీఎం రమేష్‌కు పూలమాలతో సత్కరిస్తున్న రత్నాకర్, జైవీర్


సీఎం రమేష్‌కు స్వీటు తినిపిస్తున్న బుద్ద, చిత్రంలో తాతయ్యబాబు

కొత్తూరు, జూన్ 15 : సార్వత్రిక ఎన్నికల్లో కూటమి నుంచి అనకాపల్లి పార్లమెంటు సభ్యునిగా పోటీ చేసి అఖండ విజయం సాధించిన సీఎం రమేష్‌ను నూకాంబిక దేవస్థానం ఈవో ప్రసాద్, పూజారులు శనివారం ఇక్కడ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, యువ నాయకుడు దాడి జైవీర్‌లు ఎంపీ రమేష్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి గజమాల, జ్ఞాపికలతో సత్కరించారు. ఇదిలావుంటే, ఎంపీ సీఎం రమేష్‌ను పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పూడిమడక కూడలి వద్ద ఉన్న క్యాంపు కార్యాలయంలో నేతలంతా కలిశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు ఆయనకు స్వీటు తినిపించారు. కూటమి నాయకులు బత్తుల తాతయ్యబాబు, దాడి రత్నాకర్, కేకేవీఏ నారాయణరావు, కోట్ని రామకృష్ణ, బోడి వెంకట్రావు, పొలిమేర నాయుడు, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్లలో హోరుగాలి.. జోరువాన

▸ జల్లూరు వంతెన సమీపంలో కూలిన భారీ వృక్షం ▸ రెండు గంటలు ట్రాఫిక్ జామ్


జల్లూరు వంతెన సమీపలంలో భారీవృక్షం కూలిపోవడంతో నిలిచిపోయిన ట్రాఫిక్

కోటవురట్ల, జూన్ 15 : వాతావరణంలో మార్పుల కారణంగా మండలంలో శనివారం గాలి వాన బీభత్సం సృష్టించింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత కొనసాగినప్పటికీ సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో ఒక్కసారిగా మారిపోయింది. ఉరు ములు, మెరుపులు, గాలులతో ఏకధాటిగా వర్షం పడింది. దీంతో యండపల్లి, జల్లూరు, బీకేపల్లి, రామచంద్రపాలెం, నీలిగుంట, సుంకపూర్‌లలో ఎక్కడికక్కడ లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. కోటవురట్ల నుంచి నర్సీపట్నం వెళ్లే మార్గంలోని జల్లూరువంతెన సమీపంలో భారీ వృక్షం కూలిపోయింది. ఇది రోడ్డుకు అడ్డంగా పడడంతో రెండున్నర గంటల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంత రాయం ఏర్పడింది. ఇరువైపులా కిలోమీటరు పొడవున బారులు తీరి వాహనాలు నిలిచిపోవడంతో అంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే రామచంద్రపాలెం నుంచి బీకేపల్లి వచ్చే మార్గంలో పలుచోట్ల చెట్లు విరిగి రోడ్డుపై పడడంతో అక్కడ కూడా రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. అధికారులు వెంటనే స్పందించి జేసీబీ సాయంతో చెట్ల కొమ్మలను నరికించి, తొలగించడంతో ట్రాఫిక్ క్లియర్ అయ్యింది. తాజా వాతావరణంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి తొమ్మిది గంటలకు పునరుద్ధరణ జరగడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు. గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కన్నూరుపాలెంలో చోరీ

▸ రెండు తులాల బంగారం, కిలో వెండి, రూ.90వేల నగదు అపహరణ

కశింకోట, జూన్ 15 : మండలంలోని కన్నూరుపాలెంలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటనకు సంబంధించి కశింకోట సీఐ ఎం.వినోద్‌బాబు తెలిపిన వివరాలివి. గ్రామానికి చెందిన బొడ్డు కాశీ బదిరీ విశ్వేశ్వరరావు తన భార్య రాజ్యలక్ష్మి, కుమారుడు సూర్యప్రకాశరావుతో కలిసి గురువారం విజయవాడ వెళ్లారు. అక్కడ కుమారుడు సూర్యప్రకాశరావును కళాశాలలో చేర్పించారు. తిరిగి శుక్రవారం రాత్రికి ఇంటికి వచ్చి చూడగా, తలుపునకు వేసిన తాళాలు తీసివేసి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో వస్తువులన్నీ చిందర వందరగా పడి ఉన్నాయి. బీరువాలో ఉన్న కిలో వెండి వస్తువులు, పాత బంగారం రెండు తులాలు, నగదు రూ.90వేలు చోరీకి గురైనట్టు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

గొర్లె ధర్మవరం ఆలయంలో సీసీ కెమెరాలు చోరీ

అచ్యుతాపురం, జూన్ 15 : మండలంలోని గొర్లె ధర్మవరం విజయదుర్గ ఆలయంలో చోరీ జరిగినట్టు సీఐ బుచ్చిరాజు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన అందించిన వివరాలివి. ఆలయ ట్రస్టీ మీసాల సత్యనారాయణ కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల తొమ్మిదో తేదీన తిరుపతి వెళ్లారు. శనివారం తిరిగి వచ్చిన ఆయన ఆలయానికి వెళ్లి చూడగా, ప్రధాన తలుపులు తెరిచి ఉన్నాయి. ఆలయంలో గల ఐదు సీసీ కెమెరాలతో పాటు రూ.ఐదు వేల నగదు చోరీకి గురైనట్టు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు ఎస్ఐ ఎం. నారాయణరావు సిబ్బందితో వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారన్నారు. అనంతరం కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ప్రశాంత వాతావరణంలో
బక్రీద్ జరుపుకోవాలి

▸ ముస్లింలకు ఎస్పీ కేవీ మురళీకృష్ణ సూచన



అనకాపల్లి రూరల్, జూన్ 15 : ప్రశాంత వాతావరణంలో ముస్లింలు కుటుంబసభ్యులతో సంతోషంగా బక్రీద్ పండగ జరుపుకోవాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ సూచించారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 17వ తేదీన జరిగే బక్రీద్ పండగకు పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గోవులను ఒకచోట నుంచి మరొక చోటకు తరలించే క్రమంలో తగిన ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలన్నారు. జిల్లా వ్యాప్తంగా గోవుల రవాణాపై నిరంతరం నిఘా ఏర్పాటు చేయాలన్నారు. గోవులను వధించడం పూర్తిగా నిషేధమని, చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

మాట నిలబెట్టుకున్న చంద్రబాబు : బత్తుల

తుమ్మపాల, జూన్ 15: రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అధికారం చేపట్టిన వెంటనే తొలి ఐదు సంతకాలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పలు కార్యక్రమాలు అమలు చేశారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెగా డీఎస్సీతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయన్నారు. అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, పింఛన్ల పెంపుతో పేద ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ల్యాండ్ టైటిలింగ్ రద్దుతో ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను చెరిపి వేశారన్నారు. భవిష్యత్తులో రాష్ట్రం అభివృద్ధి బాట పట్టడం ఖాయమని పేర్కొన్నారు.

నేడు కూటమి శ్రేణుల ఆత్మీయ సమావేశం

సబ్బవరం, జూన్ 15 : ఇక్కడికి సమీపంలోని ఇరువాడ పరిధిలో గల జీఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం పది గంటలకు కూటమి నేతలు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరగనుందని టీడీపీ పెందుర్తి నియోజకవర్గం ఇన్‌చార్జి గండి బాబ్జీ ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని వివరించారు. మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు హాజరు కావాల్సిందిగా కోరారు.

నవదుర్గామాత ఆలయ వార్షికోత్సవం

రాంబిల్లి, జూన్ 15 : మండలంలోని కట్టుబోలు గ్రామంలో నవదుర్గా మాత ఆలయ వార్షికోత్సవం ఆదివారం జరగనుంది. ఇందుకు సంబంధించి ఉత్సవ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా వారు కోరారు.

మలేరియాపై గ్రామాల్లో అవగాహన ర్యాలీ

తుమ్మపాల, జూన్ 15 : గ్రామాల్లో దోమల నివారణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారిణి నజరత్ షమీమ్ పేర్కొన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దోమలు దరి చేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ బి.సంగం, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

నేడు బయ్యవరంలో విద్యుత్‌కు అంతరాయం

కశింకోట, జూన్ 15 : బయ్యవరం సబ్‌స్టేషన్ పరిధిలో ఇండస్ట్రియల్ లైన్‌కు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను ఆదివారం తొలగించనున్నామని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పనుందన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు ఎంపీ పరామర్శ

గాజువాక, జూన్ 15: పాడేరు రోడ్డు ప్రమాదంలో గాయపడి గాజువాకలోని ఆర్కే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ పరామర్శించారు. బాధితులతో ఆయన మాట్లాడుతూ ధైర్యంగా ఉండాలని, అందరినీ ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఆయన వెంట బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, నాయకులు గూటూరు శంకరరావు, తాతారావు ఉన్నారు.

ఘనంగా నడిపల్లి గణేష్ జన్మదిన వేడుకలు


కేక్‌కట్ చేస్తున్న నడిపల్లి గణేష్

అనకాపల్లి, జూన్ 15 (అనకాపల్లి) : టీడీపీ సీనియర్ నాయకుడు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు నడిపల్లి గణేష్ జన్మదిన వేడుకలను శనివారం తుమ్మపాలలో ఘనంగా నిర్వహించారు. అభిమానుల మధ్య ఆయన కేక్‌లు కట్‌చేశారు. గ్రామాల్లో గణేష్ యువసేన సభ్యులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. జీడీఎస్ కెమికల్స్ వర్కర్స్, యూనియన్ స్టాఫ్ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. నాయకులు వియ్యపు సింహాచలం యాదవ్, నడిపల్లి బోసు బాబు, జనపాల రాము, పెద్దిశెట్టి బద్రి, మాదబోయిన నాగరాజు, పెంటకోట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పెదపాడులో విత్తనాలు పంపిణీ

అచ్యుతాపురం, జూన్ 15 : పెదపాడులో రైతులకు ఆదివారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ చేతుల మీదుగా విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందని జనసేన పార్టీ నాయకుడు జనపరెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మెల్యేగా సుందరపు విజయం సాధించిన మొట్టమొదటిసారిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

నాయకులకు గుర్తింపు లేకపోవడం..

... 3వ పేజీ తరువాయి

అవసరం లేదనే ఉద్దేశంతో వారంతా ఉండిపోవడం వల్ల ఓడిపోయామే గానీ ప్రజలు వల్ల కాదన్నారు. రాష్ట్ర నాయకత్వం గ్రామ స్థాయి నాయకులను గుర్తించకపోవడం వల్లే ఓడిపోయామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు మాట్లాడుతూ ఎన్నికల్లో కోటవురట్ల మండలం మెజారిటీ తగ్గినా తనకు బాధ లేదన్నారు. ఈ సునామీలో ఈ మండలంలో మెజారిటీ వచ్చినా గెలవలేమన్నారు. అందరికీ తాను అందుబాటులో ఉంటానన్నారు. ఈ సమావేశంలో పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు పైల రమేశ్, యల్లపుకుమార్‌రాజ్, సిద్దాబత్తుల సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి ఆర్చరీ పోటీలు

పరవాడ, జూన్ 15 : ఆర్చరీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి ఆర్చరీ పోటీలు శనివారం ముగిశాయి. తొలుత పోటీలను సంఘం జిల్లా అధ్యక్షుడు పి.సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి 60 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 22 నుంచి 24 తేదీ వరకు విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి తెలిపారు. అండర్-10, అండర్-13, అండర్-15 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులకు జిల్లా ఆర్చరీ సంఘం ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, సంస్కృతి గ్లోబల్ సీఈవో కె.నిశాంత్‌లు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు.

'శ్రమజీవుల గళం శ్రీశ్రీ'

తుమ్మపాల, జూన్ 15 : శ్రమజీవుల గొంతు మహాకవి శ్రీశ్రీ అని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు అన్నారు. 41వ వర్ధంతి సందర్భంగా ఇక్కడి సీపీఐ కార్యాలయంలో శనివారం శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీ రచనలు సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయన్నారు. సమ సమాజ స్థాపన కోసం యువత బాధ్యతను పదునైన కవిత్వంతో మేలుకొల్పిన మహాకవిగా కీర్తించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కండేపల్లి త్రినాథ్, విత్తనాల పోతురాజు, సత్యనారాయణ, రమణ, బి.బాబ్జి, జి.ఫణేంద్రకుమార్, వి.రాజు, మాణిక్యాలరావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.


శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పరవాడ : మహాకవి శ్రీశ్రీ వర్ధంతిని మండల కేంద్రం పరవాడలో శనివారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రామిక పీడిత వర్గాల కోసం శ్రీశ్రీ అనేక రచనలు చేశారని ఆయన కొనియాడారు. శ్రీశ్రీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మహిళా ప్రతినిధులు పైడి లక్ష్మి, నీలిమా, అరుణ, రమణమ్మ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సింహాచలానికి టీడీపీ, జనసేన నాయకులు పాదయాత్ర


సింహాచలం పాదయాత్రగా వెళుతున్న నాయకులు

ఎలమంచిలి, జూన్ 15 : రాష్ట్రానికి మళ్లీ చంద్రబాబు సీఎం కావాలని సింహాద్రి అప్పన్నకు మొక్కుకున్న టీడీపీ నాయకులు శనివారం పాదయాత్రగా సింహాచలం బయల్దేరారు. పోతిరెడ్డిపాలెం సర్పంచ్ ఇత్తంశెట్టి సన్యాసినాయుడు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఉదయం ఇక్కడ పాదయాత్ర ప్రారంభించగా, గ్రామ గ్రామాన వారికి స్వాగతం పలికారు. ఎలమంచిలి చేరుకోగానే టీడీపీ, జనసేన పట్టణ అధ్య క్షులు గొర్లె నానాజీ, బొద్దపు శ్రీను సంఘీభావం తెలిపారు. ఈ యాత్రలో మాజీ జడ్పీటీసీ రాజాన నారాయణమ్మ, బొద్దపు శ్రీను (రమణ), మాజీ సర్పంచ్ గెంజి శ్రీను, కృష్ణాపురం మాజీ సర్పంచ్ కొలగాని నాగేశ్వరరావు, జనసేన నాయకుడు రాజాన సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

'వాతావరణంలో మార్పులకు అనుగుణంగా పంటలు'


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏడీఆర్

అనకాపల్లి అగ్రికల్చర్ 15 : వాతావరణంలో మార్పులకు అనుగుణంగా రైతులు పంటల సరళిని మార్చుకోవాల్సిన అవసరం ఉందని అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ పీవీకే జగన్నాథరావు సూచించారు. ఇక్కడి ఆర్ఏఆర్ఎస్‌లో పంటలపై వాతావరణ ప్రభావం అనే అంశంపై శుక్రవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వాతావరణ మార్పులపై వారానికి రెండుసార్లు రైతుల కోసం ప్రత్యేకంగా ఆర్ఏఆర్ఎస్ విడుదల చేస్తున్న సమాచారాన్ని రైతులు అనుసరించాలని సూచించారు. విశాఖ తుఫాన్ హెచ్చరికల కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సునంద మాట్లాడుతూ వాతావరణంలో వచ్చే మార్పులు పంటలను ఏవిధంగా ప్రభావితం చేస్తాయనే అంశాన్ని వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి జి.మోహన్‌రావు, చెరుకు ప్రధాన శాస్త్రవేత్త ఆదిలక్ష్మి, డాక్టర్ వి.గౌరీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పంటలపై వాతావరణ ప్రభావం అనే పుస్తకాన్ని డాక్టర్ జగన్నాథరావు ఆవిష్కరించారు.

హోంమంత్రి అనితను కలిసిన టీడీపీ నేతలు


హోంమంత్రి అనితకు పుష్పగుచ్ఛంతో అభినందిస్తున్న తాతయ్యబాబు తదితరులు

బుచ్చెయ్యపేట, జూన్ 15 : ఏపీ హోం మంత్రి వంగలపూడి అనితను శనివారం పాయకరావుపేట పాండురంగ ఆలయంలో టీడీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనితకు శాలువ కప్పి పుష్ప గుచ్ఛం అందించారు. ఆయనతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోట్ని బాలాజీ, ఎలమంచిలి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.


మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణను సన్మానిస్తున్న బండారు, తదితరులు

మాడుగుల అభివృద్ధిలో రెడ్డి సత్యనారాయణ పాత్ర అమోఘం

» బండారు సత్యనారాయణమూర్తి

చీడికాడ, జూన్ 15 : మాడుగుల నియోజకవర్గం అభివృద్ధిలో మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణదే కీలక పాత్ర అని మాడుగుల ఎమ్మెల్యేగా ఎన్నికైన బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ 99వ జన్మదిన వేడుకలు మండలంలోని పెద్దగోకాడలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి సత్యనారాయణకు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. అనంతరం బండారు సత్యనారాయణ మాట్లాడుతూ మాడుగుల నుంచి 5 సార్లు ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్‌గా, టీటీడీ బోర్డు సభ్యులుగా పని చేసిన రెడ్డి సత్యనారాయణ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ప్రస్తుతం మాడుగుల ఎమ్మెల్యేగా గెలిచిన తాను నియోకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు. రెడ్డి సత్యనారాయణనుమాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకులు పైలా ప్రసాదరావు, కుటుంబ సభ్యులు బొడ్డు లోవరాజు, రెడ్డి రాము, రెడ్డి జయమ్మ, మాజీ మండల అధ్యక్షులు పాత్రిని సింహాచలం నాయుడు, పోతల పాత్రినాయుడు, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి రెడ్డి సన్యాసినాయుడు, బండారు దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో టాస్క్‌ఫోర్స్ టీం తనిఖీలు

చోడవరం,. జూన్ 15 : మండలంలోని గవరవరం పీహెచ్‌సీ పరిధిలోని రాయపురాజుపేట ఆరోగ్యకేంద్రాన్ని శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో రోగులకు అందుతున్న సేవలు, వసతులు, మందుల నిల్వలను సభ్యులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీపీవో లూసీ కార్డేరియా, గణాంకాధికారి రామచంద్రరావు, జగదీశ్, నాగమణి, ఇతర సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బందిని బృందం సభ్యులు అభినందించడంతో పాటు, సీజన్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. కార్యక్రమంలో గవరవరం పీహెచ్‌సీ సిబ్బంది రవి. పద్మ, అరుణ పాల్గొన్నారు.


రాయపరాజుపేట ఆరోగ్య కేంద్రంలో టాస్క్‌ఫోర్స్‌టీం సభ్యులు

హోం మంత్రి అనితకు అడుగడుగునా నీరాజనం

... 3వ పేజీ తరువాయి

మండలాల టీడీపీ అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, కొప్పిశెట్టి వెంకటేష్, అమలకంటి అబద్ధం, జానకి శ్రీనుతోపాటు పట్టణ పార్టీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, ఎం.రమాకుమారి తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

నక్కపల్లి: మండలంలో రాష్ట్ర హోంమంత్రి అనితకు ఘన స్వాగతం లభించింది. దేవవరంలో మాజీ ఎంపీపీ దేవర సత్యనారాయణ, సూర్య గణేశ్, గొడిచెర్ల జంక్షన్ వద్ద మెరక గ్రామాల టీడీపీ నాయకులు వైబోయిన రమణ, దొరబాబు, నానేపల్లి రాములు, మారిశెట్టి నానాజీ, ఉద్దండపురం వద్ద మాజీ సర్పంచ్ రమణ, జనసేన, టీడీపీ నాయకులు గజమాలలతో సత్కరించారు. వేంపాడు వద్ద ఉప సర్పంచ్ ఆయినంపూడి అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యుడు కుంచెమధు, పల్లా రాంబాబు, న్యాయంపూడి వద్ద జనసేన నేత ఆకేటి గోవిందరావు, టీడీపీ నాయకులు వెదుళ్ల శ్రీను, వెదుళ్ల పాపారావు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. నక్కపల్లిలో శనివారం రాత్రి 8.30 గంటలకు హోం మంత్రి అనిత కాన్వాయ్ చేరుకోగానే టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, పెంకులరాజు, మీగడ సత్తిబాబు, కేవీ సత్యనారాయణ, లోవరాజు, కక్కిరాల సురేశ్, సన్యాసిరావు, జనసేన నాయకులు కురందాసు అప్పలరాజు, బీజేపీ నాయకులు కోసూరి శ్రీను, పోలినాటి నానాజీ తదితరులు పాల్గొన్నారు. అనిత తన వాహనం పై నుంచి కార్యకర్తలకు అభివాదం చేస్తూ, పలువురితో కరచాలనం చేశారు.

ఈదురు గాలుల బీభత్సం

... 3వ పేజీ తరువాయి

చల్లబడింది. దేవరాపల్లిలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షంకురిసింది. నాలుగు రోడ్లు కూడలిలో హనుమాన్ గుడి వద్ద విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మాడుగులలో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులకు మోదకొండమ్మ అమ్మవారి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ, డిజిటల్ బోర్డులు నేలకొరిగాయి. కోటవురట్ల మండలంలో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. కోటవురట్ల నుంచి నర్సీపట్నం వెళ్లే మార్గంలో జల్లూరు వంతెన సమీపంలో భారీవృక్షం కూలిపోయింది. దీంతో రెండున్నర గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. మరో రెండు రోజుల పాటు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ కేంద్రం అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్న తరుణంలో జిల్లాలో కురుస్తున్న వర్షాలు రైతులకు ఊరటనిచ్చాయి.

చోడవరంలో..

చోడవరం :మండలంలో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు వర్షం కురిసింది. భారీ వర్షం కారణంగా పట్టణంలోని రెల్లికాలనీ, కో ఆపరేటివ్ కాలనీ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగి పొర్లాయి. పూర్ణా థియేటర్ ప్రాంతంలో రోడ్డుపై వర్షపు నీరు ప్రవహించింది.

నాయకులకు గుర్తింపు లేకపోవడం వల్లే ఓటమి

... 3వ పేజీ తరువాయి

అవసరం లేదనే ఉద్దేశంతో వారంతా ఉండిపోవడం వల్ల ఓడిపోయామే గానీ ప్రజలు వల్ల కాదన్నారు. రాష్ట్ర నాయకత్వం గ్రామ స్థాయి నాయకులను గుర్తించకపోవడం వల్లే ఓడిపోయామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు మాట్లాడుతూ ఎన్నికల్లో కోటవురట్ల మండలం మెజారిటీ తగ్గినా తనకు బాధ లేదన్నారు. ఈ సునామీలో ఈ మండలంలో మెజారిటీ వచ్చినా గెలవలేమన్నారు. అందరికీ తాను అందుబాటులో ఉంటానన్నారు. ఈ సమావేశంలో పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు పైల రమేశ్, యల్లపుకుమార్‌రాజ్, సిద్దాబత్తుల సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

చెరువుతూము మూసివేసి చేటు చేస్తారా..?

» ఇప్పటికే ఒకటి కనుమరుగు
» పంటపొలాలను సాగునీటి ప్రవాహం ముంచివేస్తుందంటున్న ఏఎల్‌పురం రైతులు
» తీవ్రంగా నష్టపోతామని ఆవేదన

కృష్ణాదేవిపేట, జూన్ 15 : గొలుగొండ మండలం ఏఎల్‌పురం బోయివాని చెరువు నుంచి పంట పొలాలకు సాగునీటిని విడుదల చేసే కల్వర్టు (తూము)ను మట్టితో పూర్తిగా మూసివేస్తున్నారు. దీంతో చెరువు కింద సాగు చేసే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో పంటకు సిద్ధం అవుతున్న రైతులకు చెరువులో నీరు పంటపొలాలకు వెళ్లాలంటే ఈ తూము ఒక్కటే ఆధారం. ఇప్పుడు ఈ తూము మూసేస్తే చెరువు కింద వరి సాగు చేసే సుమారు 150 ఎకరాలు రైతులు పంట


ఏఎల్‌పురంలో మట్టి వేసి మూసివేస్తున్న మదుం

చివరదశలో కష్టాలు తప్పవు. అంతేకాకుండా చెరువు నిండితే ఈ తూములు ద్వారా పంటపొలాలకు నీరు విడుదల కానున్నది. దీంతో తూము మూసివేతతో చెరువు నిండితే తారురోడ్డుపై నుంచి నీరు పంట పొలాల్లోకి ప్రవహిస్తుంది. దీంతో తారురోడ్డు గండికి గురయ్యే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు. దీనికి తోడు చెరువు నీరు రోడ్డు పై నుంచి వస్తే కిందనున్న వరి పంటపొలాలు నీటిఉధృతకు కొట్టుకుపోయే పరిస్థితి ఎదురవుతుందని రైతులు వాపోతున్నారు. అదే జరిగితే రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ చెరువుకు రెండుతూములు ఉండగా, ఒకటి కప్పేసి కనుమరుగు చేశారు. ఇప్పుడు మరో తూమును కూడా సమీప రైతులు చదును చేసే ప్రక్రియలో భాగంగా మట్టితో కప్పి తూమును మూసివేస్తుండడం తగదని రైతులు అంటున్నారు. దీనిపై నీటి వనరుల శాఖ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని చెరువు కింద ఉన్న ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన చెట్లు

» ఉదయం అంతా ఎండ తీవ్రత, ఉక్కపోత » సాయంత్రానికి ఉరుములు, మెరుపులతో గాలివాన


దేవరాపల్లిలో కురుస్తున్న వర్షం


రావికమతంలో పాకపై పడిన చెట్టు


వడ్డాది కూడలిలో పడుతున్న వర్షం

మాడుగుల, జూన్ 15 : మండల కేంద్రంలో శనివారం సాయంత్ర ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు ఉక్కపోత భరించలేక నానా అవస్థలు పడ్డారు. అయితే సాయంతానికి ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు. అయితే ముందు రోజు శుక్రవారం కురిసిన భారీ వర్షం, ఈదురు గాలులు కారణంగా జూన్ 18న జరిగే మోదకొండమ్మ అమ్మవారి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ, డిజిటల్ బోర్డులు నేలకొరిగాయి. దీంతో శనివారం కూడా ఈదురు గాలులు వీస్తాయని భయాందోళ చెందారు. కానీ వర్షంతో సరిపెట్టడంతో పండుగ నిర్వాహకులు ఊపిరిపీల్చుకున్నారు.

మాడుగుల రూరల్ : మండలంలో శనివారం సాయంత్రం భారీ వర్షం పడింది. ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వాతావరణం రోజూ మాదిరిగానే ఎండ కాసింది. ఆ తర్వాత ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చింది. ఆకాశమంతా మేఘావృతమై ఈదురు గాలులు వీస్తూ భారీ వర్షం పడింది. పలు చోట్ల చెట్టు కొమ్మలు విరిగాయి. ఈదురు గాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో విద్యుత్ వినియోగదారులు ఇబ్బంది పడ్డారు.

బుచ్చెయ్యపేటలో..

బుచ్చెయ్యపేట : మండలంలో శనివారం మధ్యాహ్నం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాధారణంగా ఉన్న వాతావరణం మధ్యాహ్నానికి ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశంలో దట్టమైన మబ్బులు కమ్మాయి. గంటన్నర పాటు భారీ ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో పలు చోట్ల చెట్లు, చెట్ల కొమ్మలు నేలకొరిగాయి. వడ్డాది, విజయరామరాజుపేట, బంగారుమెట్ట తదితర గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కురిసిన వర్షం పచ్చిరొట్ట ఎరువుల సాగుకు అనుకూలమని రైతులు అంటున్నారు.

దేవరాపల్లిలో..

దేవరాపల్లి : మండలంలో శనివారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన కుండపోత వర్షం పడింది. దీంతో మండల కేంద్రం నాలుగు రోడ్ల కూడలిలో హనుమాన్ గుడి వద్ద చెట్టు కొమ్మలు విరిగి పడి విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గర్శింగి, పెద నందిపల్లి ఫీడర్‌లో పలు గ్రామాల్లో అంధకారం నెలకొంది.

నర్సీపట్నంలో..

నర్సీపట్నం అర్బన్ : మండల కేంద్రంలో శనివారం మధ్యహ్నం మెరుపులు, ఉరుములతో వర్షం పడింది. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండుగంటల వరకూ ఎండకాసింది. ఎండకు ఉక్కపోత రావడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. అయితే మధ్యాహ్నం రెండు గంటలకు వాతావరణం ఒక్కసారిగా చల్లబడి వర్షం పడింది. దీంతో ప్రజలు ఊరట చెందారు. ఈ వర్షాలు మెరక దుక్కులకు ఎంతగానో ఉపయోగపడతాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రావికమతంలో..

రావికమతం : మండలంలో శనివారం ఈదురు గాలులు వీచాయి. దీంతో పలు చోట్ల చెట్లు నేలమట్టమయ్యాయి. గుమ్మాళ్లపాడులో శెట్టి చెట్టు విరిగి పడడంతో ఓ పశువుల పాక పాడైంది.

కృష్ణాదేవిపేటలో జోరు వాన

కృష్ణాదేవిపేట, జూన్ 15 : గొలుగొండ మండలంలో పలుగ్రామాల్లో ఈదురుగాలులతో శనివారం సాయంత్రం భారీ వర్షం పడింది. ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్ నాగాపురం, చోద్యం, లింగంపేట, పాత కృష్ణాదేవీపేట తదితర గ్రామాల్లో రోడ్లు జలమయమయ్యాయి. ముఖ్యంగా కృష్ణాదేవీపేట ఆర్టీసీ బస్‌స్టేషన్ వర్షపునీటితో చెరువును తలపించేలా దర్శనమించింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కొంగసింగిలో కసవ రాజు సూర్యప్రకాష్ ఇంటిపై భారీ వేపచెట్టు నేలకొరిగిన పెక్కిటిళ్ళు పాక్షింగా దెబ్బతింది. ఏఎల్‌పురం డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండటంతో వర్షం నీరు రోడ్డు పక్కన గల ఇళ్ళలోకి చేరింది. వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.


తటాకాన్ని తలపిస్తున్న కృష్ణాదేవిపేట ఆర్టీసీ బస్‌స్టేషన్

☛ సంక్షిప్తంగా..

నీలకంఠేశ్వరస్వామి కల్యాణం రేపు

బుచ్చెయ్యపేట, జూన్ 15 : వడ్డాది పెద్దబజారు వీధిలో కొలువైయున్న ఉమా నీలకంఠేశ్వరస్వామి 171వ వార్షిక కల్యాణోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు దొంతికుర్తి శ్రీనివాసశర్మ తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, శాస్త్రోయుక్తంగా కళ్యాణం నిర్వహించనున్నట్టు తెలిపారు. కళ్యాణం సందర్భంగా విచ్చేసే భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

ట్రైబల్ వెల్ఫేర్ బాలుర ఆశ్రమ పాఠశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మాడుగుల రూరల్, జూన్ 15 : మండలంలోని నరసయ్యపేట ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో సీట్లు భర్తీ చేస్తున్నట్టు హెచ్‌ఎం బావరాజు అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలలోని మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్న ఖాళీ సీట్లు ఉన్నాయన్నారు.మూడు, నాలుగు, ఐదు తరగతులు వరకు ఆయా తరగతులకు ఒక్కో తరగతికి 20 సీట్లు ఖాళీ ఉన్నట్టు పేర్కొన్నారు. ఆరో తరగతిలో 40, ఏడో తరగతిలో 23, ఎనిమిదో తరగతిలో 12 సీట్లు ఖాళీలు ఉన్నాయని చెప్పారు. తొమ్మిది, పది తరగతులకు సీట్లు ఖాళీ లేవన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ : 86885 25042లో సంప్రదించాలని కోరారు.

పంపిణీకి సిద్ధంగా వరి విత్తనాలు

కె.కోటపాడు, జూన్ 15 : రైతులకు అన్ని రకాల వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ తెలిపారు. మంగళవారం నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభించి రైతులకు విక్రయించడం జరుగుతుందన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఆర్వో ప్లాంట్ ఏర్పాటు


కళాశాలలో ఏర్పాటు చేయనున్న ఆర్వో ప్లాంట్

కృష్ణాదేవిపేట, జూన్ 15 : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఎట్టకేలకు ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ కళాశాలలో సుమారు 200 మంది గిరిజన, మైదాన ప్రాంతాల విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ తాగునీటికి సరైన మినరల్ వాటర్ సదుపాయం లేదు. దీంతో రూ.5 లక్షలు నాడు-నేడు నిధులతో మంజూరైన ఆర్వో ప్లాంట్ శనివారం కళాశాలకు చేరింది. దీంతో విద్యార్థులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని సదుపాయాలున్న ఈ కళాశాలలో విద్యార్థులు అడ్మిషన్లు జరుగుతున్నాయని విద్యార్థులు సద్వినియోగపరుచుకోవాలని ప్రిన్సిపాల్ కె.శ్రీహరి కోరారు.

క్వారీ లారీల టెర్రర్

... 3వ పేజీ తరువాయి

గాయాలయ్యాయి. సదరు క్వారీ యాజమాని ఆస్పత్రిలో చేర్పించి ఎటువంటి కేసు లేకుండా చికిత్స చేయించి పంపేశారు. అనకాపల్లి పరిసరాల్లో వున్న క్వారీల నుంచి నిత్యం పదుల సంఖ్యలో క్వారీ లారీలు పట్టణ వీధుల మీదుగా రేయింబవళ్ల తేడా లేకుండా రాకపోకలు సాగిస్తుండడంతో ఎప్పుడు ఏ వాహనం నుంచి బండరాళ్లు జారిపడతాయోనని వాహనచోదకులు భీతిల్లుతున్నారు.

పట్టించుకోని అధికారులు

క్వారీల నుంచి నిబంధనలు పాటించకుండా పగటి పూట కూడా అధిక లోడ్‌తో లారీలు, టిప్పర్లు పట్టణ వీధుల్లో రాకపోకలు సాగిస్తున్నా పోలీసు, రవాణాశాఖాధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. వాస్తవానికి రాత్రి వేళల్లో మాత్రమే పరిమితికి మించకుండా బండరాళ్లు, కంకర రవాణా చేయాల్సి ఉంది. అయితే ఈ నిబంధనలను లారీ యజమానులు పాటించడం లేదు. అప్పుడప్పుడు రవాణాశాఖాధికారులు అధిక లోడ్‌లతో వెళుతున్న కొన్ని లారీలు, టిప్పర్ల యజమానులపై కేసులు నమోదుచేసి అపరాధ రుసుము విధించి వదిలేస్తుండడంతో కొద్ది రోజుల్లోనే మళ్లీ అవే వాహనాలు యథేచ్ఛగా రోడ్లపై అధిక లోడ్‌లతో తిరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పోలీసు, రవాణాశాఖాధికారులు అధిక లోడ్‌లతో క్వారీల నుంచి పట్టణ వీధుల మీదుగా తిరుగుతున్న లారీలు, టిప్పర్లను నియంత్రించాలని, ప్రమాదాలు జరగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

వ్యవసాయానికి పెద్దపీట

» కె.ఎస్.ఎన్.రాజు


రైతులకు రాయితీ విత్తనాలను పంపిణీ చేస్తున్న కేఎస్ఎన్ రాజు

రోలుగుంట, జూన్ 15 : ఈ ప్రభుత్వం రైతు పక్షపాతి అని వ్యవసాయానికి పెద్దపీట వేస్తామని మాడుగుల ఎమ్మెల్యేగా ఎన్నికైన కె.ఎస్.ఎన్.రాజు పేర్కొన్నారు. శనివారం మండలంలోని రోలుగుంటలో స్థానిక పీఏసీఎస్‌లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రాయితీ విత్తనాల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేఎస్ఎన్ రాజు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అవసరమైన అన్ని పథకాలను అమలు చేస్తామన్నారు. వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, ఎరువులు వంటి వాటిపై రాయితీపై అందిస్తామని పేర్కొన్నారు. అన్నదాతకు ఎన్డీఏ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అధికారులు, ఉద్యోగులు రైతుల వద్దకు వెళ్లి సేవలు అందించాలని సూచించారు. అనంతరం రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గుమూలురు చంద్రమౌళి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచాడ చంద్ర, ఎంపీటీసీ సుర్ల రామకృష్ణ, బంటు చిరంజీవి, బోడాపాత్రుని నరేష్, వుండా రమణబాబు, బలిజి మహారాజు, ఏవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రావికమతంలో..

రావికమతం : చోడవరం నియోజకవర్గంలో రైతులు వ్యవసాయ సాగు నీటి సమస్యలను అధిగమించేందుకు ప్రాధాన్యమిస్తానని మాడుగుల ఎమ్మెల్యేగా ఎన్నికైన కేఎస్ఎన్ రాజు అన్నారు. శనివారం స్థానిక ఆర్‌బీకే ద్వారా రైతులకు వరి విత్తనాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ రైతాంగానికి సుజల స్రవంతి పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగు నీరు అందించాలన్నదే తన లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికే ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అంతకు ముందు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేగా ఎన్నికై మొదటి సారిగా రావికమతం వచ్చిన రాజును పూల మాలలు, దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రావికమతం ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, మండల కూటమి పార్టీల అధ్యక్షులు రాజాన కొండనాయుడు,మైచర్ల నాయుడు, గూటాల చిన్న, తహసీల్దార్ రమణారావు, ఎంపీడీవో భానోజీరావ, కొత్తకోట సీఐ అప్పలనాయుడు,తదితరులు పాల్గొన్నారు.


రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న రాజు

చోడవరంలో..

చోడవరం : ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచడంతో పాటు, రైతాంగ సమస్యలపై సత్వరం స్పందిస్తామని ఎమ్మెల్యేగా గెలిచిన కేఎస్ఎన్ఎస్ రాజు రైతులకు భరోసా ఇచ్చారు. శనివారం మండలంలోని రేవళ్ల గ్రామంలో రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లునాయుడు, విశాఖ డయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ పెదబాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మత్స్యరాజు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్, వ్యవసాయశాఖ ఏడీ రవీంద్రనాథ్, ఏవో పావని, విస్తరణాధికారి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'బడి ఈడు పిల్లల్ని స్కూలులో చేర్చాలి'


కె.కోటపాడు, జూన్ 15 : 'నేను బడికి పోతా' కార్యక్రమంలో ఆరు నుంచి 14 సంవత్సరాల వయసు గల పిల్లలందరూ బడిలోనే కొనసాగేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బీఎస్‌కేఎన్ పట్నాయక్ స్పష్టం చేశారు. కె.కోటపాడు మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలు కేజీబీవీ ప్రధానోపాధ్యాయుల సమావేశం శనివారం ఎంఈవో కార్యాలయంలో జరిగింది. యూడీఐఎస్‌ఈ ప్లస్ మీద ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. బడి ఈడు గల ఏ ఒక్క పిల్లవాడు డ్రాప్ అవుట్ కాకుండా చూడాలన్నారు. పాఠశాల స్థాయిలో హ్యాబిటేషన్ పరిధిలో ర్యాలీలు, ఇంటింటి ప్రచారం, తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం చేయాలన్నారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు,


మాట్లాడుతున్న ఎంపీడీవో బీఎస్‌కేఎన్ పట్నాయక్

ఎంఈవో-1 సత్యనారాయణ, ఎంఈవో-2 డీవీడీ ప్రసాద్, ఈవోపీఆర్‌డీ ప్రసాద్, సీడీపీవో, డిప్యూటీ తహసీల్దార్ పాల్గొన్నారు.

మహిళా ప్రజా ప్రతినిధులతో వరి విత్తనాలు పంపిణీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ స్వాతి

చీడికాడ, జూన్ 15 : ప్రభుత్వం అందిస్తున్న రాయితీ వరి విత్తనాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ డి.స్వాతి, సర్పంచ్ గొల్లవిల్లి చినమ్మలు కోరారు. 'విత్తనాలు పంపిణీలో సూపర్లు' కథనం శనివారం 'ఆంధ్రజ్యోతి'లో రావడంతో స్పందించిన వ్యవసాయ అధికారులు వరహాపురంలో గ్రామ సచివాలయం వద్ద శనివారం ఇద్దరు మహిళా ప్రతినిధులు చేతుల మీదుగా రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ సిబ్బంది రాజా మాట్లాడుతూ స్వర్ణ, ఆర్‌జీఎల్, సాంబమసూరి వంటి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబరు గొల్లవిల్లి రాజుబాబు, టీడీపీ వైసీపీ నాయకులు పేరపు కొండబాబు, దర్మశెట్టి కొండబాబు, వరహాలనాయుడు, రాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.